జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | ఆదివారం 05 ఏప్రిల్ 2026 | సంపుటి: 19 | సంచిక: 28 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , చైత్ర మాసము , తిథి: త్రయోదశి - 06:58:20 వరకు నక్షత్రంపూర్వఫల్గుణి - 15:21:17 వరకు కరణంతైతిల - 06:58:20 వరకు, గర - 19:00:31 వరకు పక్షంశుక్ల యోగంగణ్డ - 15:40:18 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## రాష్ట్రేతర ఓటర్లకు ప్రభుత్వం శుభవార్త

**ఓటేయడానికి వెళ్లే ఉద్యోగులకు ప్రత్యేక సెలవు**

హైదరాబాద్,ఏప్రిల్4(ప్రజాజ్యోతి): ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో

మిగతా1 2లో..

## సికింద్రాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత

హైదరాబాద్,ఏప్రిల్4(ప్రజాజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో భారీగా గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. రూ.50 లక్షల విలువైన గంజాయి తోపాటు, రూ.72,500 నగదును రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయానికి యత్నించిన నలుగురిని అరెస్టు చేశారు. తుని నుంచి రైలులో హైదరాబాద్, ముంబయికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.




# అమెరికాకు బిగ్ షాక్!

- ఏ-10 యుద్ధవిమ్మనాన్ని కూల్చేసిన ఇరాన్!
- మధ్య ప్రాచ్యంలో మరింత పెరిగిన ఉద్రిక్తత
- సీజ్‌ఫైర్ ప్రతిపాదనను తిరస్కరించిన ఇరాన్
- హర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఉద్రిక్తతలు
- ఒప్పందం చేసుకోవడానికి గడవు ముగుస్తోంది
- ఇరాన్‌కు మరోమారు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

హైదరాబాద్,ఏప్రిల్4(ప్రజాజ్యోతి): మధ్య ప్రాచ్యం కుతకుతలాడుతోంది. యుద్ధ నేపథ్యంలో అమెరికాకు చెందిన ఏ-10 యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్టు ఇరాన్ సైన్యం ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన సముద్ర మార్గమైన హుర్ముజ్ జలసంధి సమీపంలో ఈ ఘటన జరిగినట్టు ఆల్ జజిరా నివేదించింది. ఈ వ్యూహాత్మక జలమార్గం దక్షిణ భాగంలో విమానాన్ని లక్ష్యంగా చేసుకున్నారని ఇరాన్ మిడియా, తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ నివేదించాయి. అయితే దీనిపై అమెరికా కూడా ఘాటుగా స్పందించింది. అమెరికా సైనిక విమానాన్ని కూల్చివేయడం ఇరాన్‌తో చచర్చలపై ఎలాంటి ప్రభావం చూపదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఈ ఘటన దెబ్బతీస్తుందన్న సూచనలను ఆయన తోసిపుచ్చారు. జరుగుతున్న పరిణామాలు చర్చలను ప్రభావితం చేస్తాయా అని ట్రంప్‌ను అడిగినప్పుడు ఆయన " లేదు, అస్సలు కాదు. ఇది యుద్ధం మనం

మిగతా 2లో..

## దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

- సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు
- ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలు
- కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ



తిరువనంతపురం,ఏప్రిల్4(ప్రజాజ్యోతి): జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో నిజం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కొందరు కావాలనే ఈ వాదనను తెరపైకి తెచ్చారని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలైందని చెప్పారు. తిరువళ్లలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై

మిగతా 12లో..

# బాసర మాస్టర్ ప్లాన్‌కు సీఎం రేవంత్ ఓకే

- రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి
- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా బాసరలో నిర్మాణాలు
- 6న ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన
- అధికారులతో పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్4(ప్రజాజ్యోతి): బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని

మిగతా 2లో..

## సింగరేణి కార్మికులకు శుభవార్త

**సహజ మరణానికి కూడా పదిలక్షల బీమా**



హైదరాబాద్,ఏప్రిల్4(ప్రజాజ్యోతి): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్మికుల సంక్షేమం దిశగా మరో కీలక అడుగు పడింది. సింగరేణి యాజమాన్యం తీసుకున్న ప్రత్యేక చొరవతో, కార్మికులకు లభించే బీమా సౌకర్యం ఇప్పుడు మరింత విస్తృతమైంది. ఇకపై ప్రమాదవశాత్తు జరిగే మరణాలకే కాకుండా, సహజ మరణానికి కూడా రూ. 10 లక్షల ఉచిత బీమా పథకాన్ని అమలు చేయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. సాధారణంగా బ్యాంకులు ప్రమాద బీమాను మాత్రమే అందిస్తుంటాయి. అయితే, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం యూనియన్

మిగతా 12లో..

## కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

- రేవంత్ ఆదేశాలతోనే దాడికి వ్యూహం
- తీవ్రంగా ఖండించిన హరీష్ రావు
- క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనం
- మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు



హైదరాబాద్,ఏప్రిల్4(ప్రజాజ్యోతి): ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని,

మిగతా 12లో..

# బీఆర్ఎస్ కైవసం

- బీఆర్ఎస్ ఖాతాలో ఇబ్రహింపట్నం, క్యాతన్‌పల్లి
- పట్నం చైర్మన్‌గా టేకుల సుదర్శన్ రెడ్డి ఎన్నిక
- క్యాతన్‌పల్లి చైర్‌పర్సన్‌గా గొడిశెల సంధ్యారాణి ఎన్నిక
- రెండుచోట్లా ఎన్నికలకు దూరంగా ఉన్న కాంగ్రెస్
- ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా
- చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వివాదం
- ఎన్నిక సందర్భంగా జోగురామన్న హౌస్ అరెస్ట్
- ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా
- బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు ఆందోళన





హైదరాబాద్,ఏప్రిల్4(ప్రజాజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా భాజపా కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. మరోవైపు మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని కూడా గులాబీ పార్టీ దక్కించుకుంది. ఇక్కడ ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి సంధ్యారాణి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్ పదవిని సీపీఐ అభ్యర్థి సరిత దక్కించుకున్నారు. ఈ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. గత కొన్ని రోజులుగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ వీడింది. ఎట్టకేలకు ఈ మున్సిపాలిటీని భారత్ రాష్ట్ర సమితి కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి టేకుల సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా బీజేపీ కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. మరోవైపు.. ఈ ఎన్నికలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికను వాయిదా

మిగతా 2లో..

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

- బావిలోకి దూసుకెళ్లిన కారు
- ఒకే కుటుంబానికి చెందిన 9మంది మృతి

ముంబై,ఏప్రిల్4(ప్రజాజ్యోతి): మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి

మిగతా 12లో..

## సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు

**బాస్‌ల పేరుతో హానికరమైన మెయిల్స్**
**అప్రమత్తంగా ఉండాలని సిపి సజ్జన్నార్ హెచ్చరిక**

హైదరాబాద్,ఏప్రిల్4(ప్రజాజ్యోతి): వ్యాపార సంస్థల అధినేతలు, సీఈఓలు, సీఎఫ్ఓలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు సరికొత్త వాట్సాప్ మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ హెచ్చరించారు. సంస్థల అధికారిక

మిగతా 12లో..

# భారీ పేలుళ్లకు ఉగ్రకుట్ర

- కుట్రను భగ్నం చేసిన పోలీసులు
- కుట్రదారులు నలుగురి అరెస్ట్



న్యూఢిల్లీ,ఏప్రిల్4(ప్రజాజ్యోతి): దేశంలో భారీ పేలుళ్ల ఉగ్రకుట్రను ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు భగ్నం చేశారు. పేలుళ్లకు ప్రణాళికలు రచించిన నలుగురిని ఉత్తర ప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్) అరెస్టు చేసింది. నిందితులకు పాక్ ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది. నలుగురు నిందితులను సాకిబ్ అలియాస్ డెవిల్, వికాస్ గెహ్లోవత్ అలియాస్ రౌనక్, లోకేశ్ అలియాస్ పాఎ÷-లా పండిట్ అలియాస్ బాబు అలియాస్ సంజు, అర్బాబ్‌గా గుర్తించారు. పాకిస్థాన్ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు వీరంతా పని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరంతా దేశవ్యాప్తంగా పేలుళ్లకు

మిగతా 12లో..

# సంపాదకీయం


## గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించాలి!


రైజింగ్ తెలంగాణ, ట్రీ మిలియన్ ఎకానమీ...ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నా..ఆచరణలో పట్టుదల ముఖ్యం. ఎపిలో స్వర్ణగ్రామం, స్వర్ వార్డులు అంటూ కొత్త పేర్లతో ఊదరగొడుతున్నారు. గ్రామాలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. ఎంతసేపు పల్లెలను విస్మరించి, పట్టణాలకే పెద్దపీట వేయడం సరికాదు. గ్రామాల అవసరాలను గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. ఫ్యూచర్ సిటీ, దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. గత రెండేళ్లుగా గ్రామాలు కునారిల్లాయి. కనీస వసతులు లేవు. గ్రామాల్లో అత్యధిక శాతం అధికార కాంగ్రెస్ ఆధిపత్యంలోనే ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి విషయంలో అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. గ్రామాల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరించలేనివేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్యం వట్టి సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు శ్రమించాలి. ఉచిత పథకాలు పెరిగినా కొద్దీ గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడుతోంది. పనిచేసే కూలీలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి ప్రజలు బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు భాగస్వాములను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను అభివృద్ధి చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. ప్రభుత్వంపై ఆశతో ప్రజలు ఉన్నారని గుర్తించాలి. ఏదో చేస్తారన్న నమ్మకం ఉంది. ఇందిరమ్మ ఇళ్లు కావచ్చు, ఇతర అభివృద్ధికావచ్చు గ్రమాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యయసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ది చేస్తే రాజధానులపై ఒత్తిడి తగ్గుతంది. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పాటు గ్రామాలు పురోగమిస్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉజ్వల తెలంగాణ నిర్మాణానికి పూనుకుంటే అది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి దోహదపడగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికి దోహదపడేలా చేయాలి. అప్పుడే తెలంగాన కల సాకారం కాగలదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. వ్యవసాయ పంటల కొనుగోళ్లను సజావుగా సాగేలా చూడాలి. పంటల విధానంలో మార్పులు రావాలి. ఇవన్నీ జరిగితేనే అనుకున్న అభివృద్ధి సాధ్యం కాగలదు.

# అమెరికాకు బిగ్ షాక్!

మొదటిపేజీ తరువాయి..

యుద్ధంలో ఉన్నాం" అని అన్నారని ఎన్‌బీసీ న్యూస్ రిపోర్ట చేసింది. ఇంటర్వ్యూ సందర్భంగా పరిస్థితి సున్నితమైదని పేర్కొంటూ, విమానం కూలి పోయిన





తర్వాత కొనసాగే గాలింపు ఇతర సహాయ చర్యలపై స్పందించేందుకు ట్రంప్ నిరాకరించారు. దీనిపై మీడియా కవరేజీ పట్ల కూడా ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో ఘటన పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. నివేదికల ప్రకారం అమెరికా వైమానిక దళానికి చెందిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానం ఇరాన్‌లో కూలిపోయింది. సిబ్బందిలో ఒకరిని అమెరికా సైన్యం సురక్షితంగా రక్షించింది. అతనికి వైద్య చికిత్స అందిస్తున్నారని సీఎన్‌ఎన్ నివేదించింది. అయితే మరో వ్యక్తి కోసం గాలింపు కొనసాగుతోంది. ఎఫ్-15ఈ విమానాన్ని ఇద్దరు వ్యక్తులు నడుపుతారని సమాచారం. ఇరాన్ మీడియా విడుదల చేసిన ఫొటోలు, వీడియోల ఆధారంగా, కూలిపోయిన శిథిలాలు ఎఫ్-15 విమానానివేని సీఎన్‌ఎన్ ధ్రువీకరించింది. ప్రస్తుతం సంఘర్షణ సమయంలో ఇరాన్ లోపల ఒక అమెరికన్ విమానం కూలిపోవడం ఇదే మొదటిసారి అని కూడా ఆ నివేదిక పేర్కొంది. కొన్ని ఛాయాచిత్రాలలో లభించిన శకలాలను బట్టి, ఆ విమానం బ్రిటన్‌లోని ఆర్‌ఏఎఫ్ లేకెన్‌హీత్ బేస్‌లో ఉన్న 494వ ఫైటర్ స్క్వాడ్రన్‌కు చెందినది అయి ఉండొచ్చని తెలుస్తోంది. అయితే ఈ ఘటనల గురించి ఉన్నాయి. ఏ-10 విమానన్ని కూల్చివేశామన్న ఇరాన్ వాదన స్వతంత్రంగా ధ్రువీకరణ కాలేదు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి వార్నింగ్ ఇచ్చారు. తమతో ఒప్పందం చేసుకోవడానికి లేదా హర్మూజ్ జలసంధిని తెరవడానికి ఇరాన్ కు ఇచ్చిన పది రోజుల గడువు దగ్గరపడిందన్నారు. సమయం మించిపోతోందని, విధ్వంసానికి 48 గంటల సమయమే ఉందన్నారు. అంతా భగవంతుడి దయ! అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. మరోవైపు అమెరికాకు చెందిన ఎఫ్-15 యుద్ధవిమానాన్ని ఇరాన్ కూల్చివేసిన విషయం తెలిసిందే. అయితే ఇందుకోసం అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఉపయోగించినట్లు ఇరాన్ వెల్లడించింది. తమ గగనతలంపై పూర్తి నియంత్రణ ఉందని ఇరాన్ సైన్యం పేర్కొంది.

# బాసర మాస్టర్ ప్లాన్‌కు సీఎం రేవంత్ ఓకే

మొదటిపేజీ తరువాయి..

అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ. 225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

# రాష్ట్రేతర ఓటర్లకు ప్రభుత్వం శుభవార్త

మొదటిపేజీ తరువాయి..

జరిగే ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు.. ఆయా రాష్ట్రాలకు చెందిన వారై ఉండి తెలంగాణలో నివసిస్తున్న ఓటర్ల కోసం ప్రత్యేక సెలవులను ప్రకటించింది. ఈ మేరకు కార్మిక , ఉపాధి శాఖ అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. ఎన్నికలు జరుగుతున్న అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఎవరైతే తెలంగాణలో ఉద్యోగ రీత్యా లేదా ఇతర పనుల నిమిత్తం స్థిరపడ్డారో.. వారందరికీ తమ సొంత రాష్ట్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఈ వెసులుబాటు




కల్పించింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. ఈ సెలవు కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగాలకు కూడా వర్తిస్తుంది. రాష్ట్రంలోని అన్ని రకాల ఫ్యాక్టరీలు, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, ఇతర సంస్థలలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులకు, ఉద్యోగులకు పోలింగ్ రోజున 'పెయిడ్ హాలిడే' ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఓటు వేయడానికి వెళ్లే ఉద్యోగుల జీతంలో ఎటువంటి కోత విధించకూడదని యాజమాన్యాలకు సూచనలు జారీ అయ్యాయి. అసోం, కేరళ మరియు పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన ఓటర్ల కోసం ఏప్రిల్ 9వ తేదీన సెలవు ప్రకటించారు. తమిళనాడు ఓటర్ల కోసం ఏప్రిల్ 23వ తేదీన ప్రత్యేక సెలవు వర్తించనుంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో వివిధ దశల్లో ఎన్నికలు జరుగుతున్నందున, అక్కడి ఓటర్ల కోసం ఏప్రిల్ 23 మరియు ఏప్రిల్ 29 తేదీల్లో సెలవులను కేటాయించారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాథమిక హక్కు అయిన ఓటును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారు సుదూర ప్రాంతాలకు ప్రయాణించి ఓటు వేయడానికి తగిన సమయం కల్పించడమే ఈ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశం. ఈ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని కూడా అధికారులు హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను గుర్తించి, ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం కోరుతోంది.

**PUBLIC NOTICE**

This to inform to the general public at large that, my client Dharme Vijay s/o Dharme Ganapathi R/o Rampur-B. Gourapur, Mdl Inderville, Dist. Adilabad, that my client is owner of Plot No. 75 in Sy. No.59/1/2 & 59/A, situated at Village & G.P. & Mandal Mavala, Dist. Adilabad, newly merged into Adilabad Municipality, my client has purchased the above property, vide registered Sale Deed No. 730/2021

That it link document No. 7700/2019 & 4842/2011 has lost.

If anyone has any claim, right, title or interest of any kind in the said property, they may contact the undersigned within 7 days of the publication of this Notice, with all documents of claim and title.

If any one finds the above document kindly handover to undersigned.

If anyone got/found the above document No. 7700/2019 & 4842/2011 they shall handed over to my client or can hand over to the address below.

If no objection is received within 7 days, and if any claim and objection arise, it shall be deemed to have been waived.

Dt: 01-04-2026

**Bipin Kumar Patel**

Advocate,

ADARSH Building,

N.H.No.44, Adilabad

Cell: 9440005500

# బీఆర్ఎస్ కైవసం

మొదటిపేజీ తరువాయి..

వేయాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ 55 రోజులు క్యాంప్ నిర్వహించిందని కాంగ్రెస్ ఆరోపించింది. ముగ్గురు కౌన్సిలర్లపై కోర్టులో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నిక నిర్వహించడం సరైనది కాదని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే కోర్టు ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహించామని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. దీంతో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఈ ఎన్నికలో భారత్ రాష్ట్ర సమితి తరఫున సుదర్శన్ రెడ్డి ఛైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయగా, కాంగ్రెస్ తరఫున ఆకుల యాదగిరి పేరును ప్రతిపాదించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలను చేతులు ఎత్తే విధానంలో నిర్వహించారు. ఎట్టకేలకు బీఆర్ఎస్ ఈ మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకుంది.

గతంలో అనేక విధ్యాలుగా గొడవలకు కారణంగా మారిన క్యాతనపల్లి మున్సిపాలిటీ పీఠాన్ని అధికారిక కాంగ్రెస్ పార్టీ దక్కించుకోలేకపోయింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ కౌన్సిలర్ గొడిశెల సంధ్యారాణి ఎన్నికయ్యారు. సీపీఐ మద్దతుతో ఆమె మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో విజయం సాధించారు. ఇక బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్, సీపీఐ పొత్తు పెట్టుకోగా, 22 వార్డులకుగాను 10 వార్డుల్లో బీఆర్ఎస్, 4 వార్డుల్లో సీపీఐ అభ్యర్థులు గెలుపొందారు. బీఆర్ఎస్-సీపీఐ కూటమికి స్పష్టమైన బలం ఉన్నది. కాంగ్రెస్ అభ్యర్థులు ఏడు స్థానాల్లోనే గెలిచారు. కానీ, మంత్రి వివేక్, కాంగ్రెస్ నేతల అరాచకాల వల్ల గతంలో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. చివరకు కోర్టు ఆదేశాలతో శనివారం క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికను నిర్వహించారు. తాజాగా నిర్వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. బీఆర్ఎస్, సీపీఐ నుంచి ఎన్నికైన 14 మంది కౌన్సిలర్లు మాత్రం ఎన్నికకు హాజరయ్యారు. ఇక కోరం ఉండటంతో ఎన్నిక ప్రక్రియను సజావుగా కొనసాగించారు. దీంతో గొడిశెల సంధ్యారాణి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఇక బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత వైస్ చైర్మన్‌గా గెలుపొందారు. ఖానాపూర్ ఛైర్‌పర్సన్ ఎన్నిక నేపథ్యంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వివాదం నెలకొంది. అధికారులతో ఎమ్మెల్యే, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. దీంతో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపై సందిగ్ధత నెలకొంది. ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అధికారులతో ఎమ్మెల్యే బొజ్జు, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే సమావేశం నుంచి ఎమ్మెల్యే బయటకు వెళ్లిపోయారు. మరోవైపు మున్సిపల్ కార్యాలయం ఎదుట భాజపా, బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారులను ఆయన బెదిరిస్తున్నారని ఆక్షేపించారు. ఇదిలావుంటే ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా మాజీ మంత్రి , నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జోగు రామన్నను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆదిలాబాద్‌లోని మాజీ మంత్రి ఇంటికి వెళ్లిన పోలీసులు హౌస్ అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి






హోంశాఖను తన ఆధీనంలో ఉంచుకొని ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు చేయించి జైలుకు పంపడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దాహంతో బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజస్వామికమని మండిపడ్డారు. ఖానాపూర్ నియోజకవర్గ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారడంతో కుట్రా పూరిత చర్యలకు దిగజారడం శోచనీయమని ఆరోపించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నియమాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘిస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యంగా జరగాల్సిన ఎన్నికలు పోలీసుల పహారా మధ్య వారికి అనుగుణంగా మార్చుకునే కుతంత్రాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. శనివారం జరిగిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సంధ్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వాగ్వాదాంతో సమావేశం గందరగోళంగా మారడంతో అధికారులు చైర్మన్ ఎన్నికను వాయిదా వేశారు. ఎన్నిక సందర్భంగా సమావేశంలో అధికారులు ఆల్ఫాబెటిక్ ఆర్డర్ ప్రకారం అంకం మౌనిక అనే బీజేపీ కౌన్సిలర్ పేరు పిలవగా, ఆమెకు మద్దతుగా ఏడుగురు కౌన్సిలర్లు చేతులెత్తారు. దీంతో మొదట కాంగ్రెస్ అభ్యర్థి చిన్నం సత్యం పేరు పిలవాలని పోడియం వద్ద ఉన్న అధికారుల మీదకి ఎమ్మెల్యే దూసుకెళ్లి, వారితో వాగ్వాదానికి దిగడంతో అధికారులు ఎన్నికను వాయిదా వేశారు. దీంతో సమావేశంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు ఆందోళనకు దిగి అధికారుల తీరును నిరసిస్తూ కార్యాలయంలోనే బైఠాయించి నినాదాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే, అధికారుల తీరు దారుణంగా ఉందని అన్నారు.మున్సిపల్ కార్యాలయంలో నిరసన తెలుపుతున్న 8 వార్డ్ కౌన్సిలర్ బొప్పారపు సత్యవతి సొమ్మసిల్లి పడిపోయారు.

# జూనియర్ సివిల్ జడ్జ్‌గా రాణించిన బీసీ బిడ్డ లిఖిత

**– తల్లిదండ్రులను సన్మానించిన జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి**



**మంచిర్యాల, 4, ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ప్రాంతానికి చెందిన అరుణక్కనగర్ నివాసి, బీసీ సామాజిక వర్గానికి చెందిన ఏకరి వెంకటేష్–లక్ష్మి దంపతుల కుమార్తె చిరంజీవి లిఖిత ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి జూనియర్ సివిల్ జడ్జ్‌గా ఎంపిక కావడం స్థానికంగా గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం సీసీసీ కార్నర్‌లో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో లిఖిత తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, రోడ్డు మీద పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగించే నిరుపేద కుటుంబం అయినప్పటికీ, తమ కుమార్తెకు ఉన్నత విద్యను అందించి ఆమెను ఈ స్థాయికి తీసుకురావడంలో తల్లిదండ్రులు చేసిన కృషి అభినందనీయం అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పిల్లల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించిన ఇలాంటి తల్లిదండ్రులను సమాజం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థానాన్ని సాధించిన లిఖిత నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. యువత తల్లిదండ్రులపై మాత్రమే ఆధారపడకుండా, వారి కష్టాన్ని అర్థం చేసుకొని లక్ష్యసాధన కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని, ఉన్నత విద్య ద్వారా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు అశోక్ వేముల, మంచర్ల సదానందం, పంపరి వేణుగోపాల్, చంద్రగిరి చంద్రమౌళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వార్డులో తీరిన తాగునీటి కష్టాలు

**– ఎఫ్ ఎఫ్ సి నిధులతో బోర్వెల్ ఏర్పాటు**





**నేరడిగొండ ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి) :** మండలంలోని కుమారి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి స్థానిక గ్రామ పంచాయతీ ప్రత్యేక చొరవ చూపింది. గత కొన్ని రోజులుగా గ్రామ పరిధిలోని ఎస్సీ వార్డులో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన కుమారి గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉపసర్పంచ్ ఆడేపు రవి మరియు వార్డు సభ్యులు తక్షణమే స్పందించారు. గ్రామ పంచాయతీకి చెందిన ( ఎఫ్ ఎఫ్ సి) నిధుల ద్వారా నూతనంగా బోర్ వేయించి, మోటారును బిగించారు. శనివారం ఈ బోర్వెల్ పనులను పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజల కనీస అవసరమైన తాగునీటిని అందించడం తమ బాధ్యత అని, కాలనీ వాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిపదికన ఈ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. చాలా కాలంగా తాగునీటి కోసం పడుతున్న అవస్థలు తొలగిపోవడంతో ఎస్సీ వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. తమ సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించిన సర్పంచ్, ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులకు కాలనీ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిల్లాలో పర్యటించిన స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సభ్యురాలు






**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 4, (ప్రజాజ్యోతి) :** స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ చైల్డ్ రైట్స్ సభ్యురాలు ప్రమీల అగర్వాల్ శనివారం జిల్లాలో పర్యటించారు. ముందుగా మామడ మండలంలోని జగదాంబ తండాలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, పిల్లలతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. పిల్లలకు సరైన సమయంలో పోషకాహారం అందించాలని సూచించారు. అనంతరం ఆమె, కొండాపూర్ లోని బాలసధనం (చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్)ను సందర్శించి, అక్కడ వసతి పొందుతున్న పిల్లలతో మాట్లాడారు. పిల్లలను సక్రమంగా చూసుకోవాలని, వారికి ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, సీడబ్ల్యూసీ మెంబర్ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి మురళి, బాలసదనము సూపరిండెంట్ వైష్ణవి, సూపర్వైజర్ రజిని, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# వైశాఖమాస ఉత్సవాలు ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు



**మంచిర్యాల, 4 ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** పట్టణంలోని శ్రీ విశ్వనాధస్వామి దేవస్థానంలో వైశాఖమాస ఉత్సవాలు మరియు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఉత్సవాలు ఈనెల 18 నుంచి మే 16, 2026 వరకు కొనసాగనున్నాయని ఆలయ అర్చకులు బాలకృష్ణ శర్మ తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 8:30 గంటలకు అమ్మవారికి వైశాఖమాస నిత్యపూజ, ఉదయం 9 గంటలకు ఉత్సవమూర్తికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించబడనున్నాయి. అలాగే ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటలకు ఊంజల్ సేవ నిర్వహిస్తారు.ప్రత్యేక కార్యక్రమాల వివరాలకు వస్తే, ఏప్రిల్ 26, 2026 ఆదివారం వాసవి జయంతి సందర్భంగా ఉదయం 10 గంటలకు సామూహిక కుంకుమ పూజ నిర్వహించడంతో పాటు సాయంత్రం 6:30 గంటలకు శోభాయాత్ర జరగనుంది. మే 1, 2026 శుక్రవారం సాయంత్రం 6:30 గంటలకు శాకంబరి ఉత్సవం నిర్వహిస్తారు. మే 16, 2026 శనివారం పుష్పార్చనతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఇక ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు లలిత సహస్రనామ పారాయణం నిర్వహించబడుతుందని ఆలయ తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేయడంతో పాటు ఉంజల్ సేవ, చందనగంధం, సుగంధ పూజలు కూడా నిర్వహించబడతాయి.

నెల రోజుల కుంకుమ పూజలో పాల్గొనదలచిన భక్తులు .516 చెల్లించి నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు అన్నారు. అలాగే కొత్త వస్త్రాల సమర్పణలో మహిళలు మాత్రమే పాల్గొనాలని సూచించారు.

ఈ వైశాఖమాస ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృప పొందాలని ఆలయ కమిటీ సభ్యులు భక్తులను కోరారు.

# గోదావరి పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేయాలి







**– రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**

**మంచిర్యాల, 4 ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :**

మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ ప్రాంతంలో గోదావరి పుష్కరాల నిర్వహణకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అధికారులకు సూచించారు. శనివారం చెన్నూర్ మండల కేంద్రంలోని గోదావరి నది తీరాన్ని ఆయన సందర్శించి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తదితర అధికారులతో కలిసి పుష్కర ఘాట్ ఏర్పాట్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు దక్షిణాది కుంభమేళా తరహాలో జరుగుతాయని, ప్రభుత్వ ఆదేశాల మేరకు గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో అనువైన చోట్ల ఘాట్‌ల ఏర్పాటు, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజా రవాణా సదుపాయాలు, త్రాగునీరు, లైటింగ్ వంటి మౌలిక వసతులను సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా మెరుగుపరిచే క్రమంలో చెన్నూర్ పట్టణంలోని మహంకాళి కాలనీ నుండి పుష్కర ఘాట్ వరకు నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల రద్దీ అంచనాల మేరకు ప్రణాళికలు రూపొందించి, భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలన్నారు. పుష్కర స్నానాల ప్రాంతాల్లో అప్రమత్తత చర్యలు తీసుకొని భక్తుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం 500 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. పుష్కరాల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెన్నూర్ పట్టణంలో స్మశాన వాటిక నిర్మాణానికి రూ.1 కోటి మంజూరు చేసి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ చెన్నూర్ గోదావరి తీరానికి రోజుకు సుమారు 2 లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ కోసం అంతర్గత రహదారుల విస్తరణ, మున్సిపల్ పరిధిలో రోడ్ల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా మూత్రశాలలు, స్నానాల గదులు, దుస్తులు మార్చుకునే గదులను శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొంది స్తున్నట్లు చెప్పారు. పుష్కరాల పనులను 2027 ఫిబ్రవరి నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. అనంతరం మంత్రి చెన్నూర్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వైద్య రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు జరుగుతున్నట్లు తెలిపారు.చెన్నూర్‌లో నిర్మాణంలో ఉన్న ఆర్టీసీ బస్ డిపో పనులను కూడా మంత్రి పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఖానాపూర్‌లో మున్సిపల్ ఎన్నికల ఉత్కంఠ ఉద్రిక్తతలో వాయిదా

**– ఎమ్మెల్యే దౌర్జన్యంతో అధికారులను బెదిరించి ప్రజాస్వామ్యాన్నిమంట కలిపారుంటున్న**

**– బిఆర్ఎస్ బిజెపి నాయకులు జాన్సన్ నాయక్ హరీష్ రాథోడ్ ల ఆరోపణ**

**– కలెక్టర్ చొరవ తీసుకొని చర్యలు తీసుకోవాలని డిమాండ్**






**ఖానాపూర్ ఏప్రిల్ 4(ప్రజా జ్యోతి) :** గతంలో వాయిదా పడ్డ మున్సిపాలిటీ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికల్లో భాగంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో శనివారం అత్యంత ఉత్కంఠ ఉద్రిక్తల మధ్య ఎన్నికలు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు అయితే గతంలో రెండుసార్లు వాయిదా సందర్భంలో బి ఆర్ఎస్ బిజెపిలకు చెందిన కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేయలేదు శనివారం జరిగిన సమావేశంలో బిజెపి టీఆర్ఎస్ కౌన్సిలర్లు 8 మంది ని ఎన్నికల అధికారులు ఉట్నూర్ ఐటిడిఏ పిఓ యువరాజ్ మర్మట్ ఆర్డీవో రత్న కళ్యాణి మండల ప్రత్యేక అధికారి జీవరత్నం ప్రమాణ స్వీకారం అనంతరం 12:30 గంటలకు చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభించారు ఎన్నికల అధికారులు స్పష్టమైన విధంగా సభ్యులకు తెలియపరచని కారణంగా చైర్మన్ వైస్ చైర్మన్ ఎంపికను ప్రారంభించిన దశలో కాంగ్రెస్కు చెందిన అభ్యర్థి చిన్నం సత్యనారాయణ (రాజురా సత్యం ) నామినేషన్ వేస్తున్నట్లు మరొకరు బలపరుస్తున్నట్లు తెలిపాగానే అక్కడున్న సభ్యులు 7చేతులు లేపి మద్దతు తెలిపారని దీంతో అధికారులు ఆలా కాకుండా ముందు అభ్యర్థుల డిక్లేర్ అనంతరం ఓటు ఇవ్వాలని దీంట్లో అక్షర క్రమ ప్రకారంగా బిజెపి కౌన్సిలర్ అంకం మౌనిక మొదటి వ్యక్తిగా ఆమె నామినేషన్ వేయాలని కోరారు దీంతో అంకం మౌనిక చైర్మన్గా నామినేషన్ వేస్తున్నట్లు ప్రకటించగానే బిఆర్ఎస్ కు చెందిన ముగ్గురు బిజెపికి చెందిన నలుగురు సభ్యులు చేతులు పైకెత్తి మద్దతు ప్రకటించారు దీంతో ఎన్నిక అయిపోయింది బీజేపీ అభ్యర్థి అని బయట సోషల్ మీడియాలో బిజెపి సంబరాలు జరుపుకున్నారు చెందిన మరో బిఆర్ఎస్ కౌన్సిలర్ సోయాబ్ అహ్మద్ వైస్ చైర్మన్అని సోషల్ మీడియాలో బి ఆర్ ఎస్ శ్రేణులు సైతం సంబరాలు జరుపుకున్నారు అయితే ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అధికారులు స్పష్టమైన నిబంధనలు తెలపక ఎన్నిక నిర్వహించారని తమకు ఓటేసిన వ్యక్తి ప్రత్యర్థి అభ్యర్థి కూడా చేతులెత్తి ఓటు వేశారని సీసీ పుటజిల్లో పరిశీలించి తమ సత్యం చైర్మన్గా ప్రకటించాలని పట్టుపట్టారు దీంతో వివాదం ముదిరింది తమకే మద్దతు ఉన్న అవకాశం ఇవ్వలేదని ఈ ఎన్నిక చెల్లదని వాయిదా వేయాలని అధికారులను మందలించామని అయితే అధికారులు తనని బెదిరించారని ఆరోపించి ఎన్నికలు వాయిదా వేయాలని తనతో పాటు ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఒక బి ఆర్ఎస్ కౌన్సిలర్ ఒక స్వతంత్ర కౌన్సిలర్లను తీసుకొని వెళ్లిపోయారు బిఆర్ఎస్ బిజెపి సంబరాలు జరుపుకున్న వ్యక్తులకు ఒకేసారి ఎన్నిక వాయిదా పడింది అని తెలియడంతో పెద్ద ఎత్తున మోహరించి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి ఎమ్మెల్యే కు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు పోలీసు జులం నశించాలంటూ అధికారుల తీరును దుయ్యప డుతూ వెంటనే బిజెపి అభ్యర్థిని చైర్మన్గా ప్రకటించాలని బి ఆర్ఎస్ అసెంబ్లీ ఇన్చార్జి జాన్సన్ నాయక్ బిజెపి జిల్లా అధ్యక్షుడునితీష్ రాథోడ్లు సామూహికంగా కాసేపు తమ సభ్యులతో ధర్నాలు నిర్వహించి ఈ ఎన్నిక వాయిదా ప్రజాస్వామ్య విరుద్ధమని ఎమ్మెల్యే తీరు పట్ల తీవ్రంగా మండిపడ్డారు ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసాహించకుండా అధికారం ఉందని అహంతో సభ్యుల కోరం లేకుండా బెదిరించి అధికారులను భయభ్రాంతులకు గురిచేసి వాయిదా వేసిన ఎన్నికను వెంటనే ప్రకటించాలని జిల్లా కలెక్టర్ తరలిరావాలని గంట సేపు బైఠాయించారు ఈ దశలో బిజెపి కౌన్సిలర్ సత్యవతి కళ్ళు తిరిగి పడిపోగా 108 లో వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు జాన్సన్ నాయక్ డిఆర్ఎస్ అసెంబ్లీ ఇంచార్జ్ బిజెపి జిల్లా అధ్యక్షుడు రాథోడ్లు ఎమ్మెల్యే చర్యపట్ల తీవ్రంగా ఖండిస్తూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యుద్ధంగా ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా రేపు ఆదివారం జరిగే ఎన్నికైన సజావుగా జరిగే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని బిజెపి బి ఆర్ఎస్ నాయకులు జాన్సన్ నాయక్ రితీష్ రాథోడ్ లు కోరుతున్నారు

**ఖానాపూర్ పట్టణంలో మున్సిపల్ సెగ ఉద్రిక్తత :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఏఎస్పి సాయికిరణ్ తో పాటు అదనపు ఎస్పి ఉపేంద్ర రెడ్డి స్థానిక సిఐ అజయ్ కుమార్ ల ఆధ్వర్యంలో సుమారు 200 మంది పోలీసులు మోహరించి పూర్తిస్థాయిలో బందోబస్తు ఎన్నికల కోసం ఏర్పాటు చేశారు పూర్తిస్థాయి ఎన్నిక అత్యంత కట్టుదిట్టగా కేవలం సభ్యులతో పాటు ఎమ్మెల్యేను ఎక్స్ ఆఫీస్ మెంబెర్ గా లోనికి పంపించారు ఎన్నిక జరగకపోగా వాయిదా పడడంతో ఒకేసారి బి ఆర్ఎస్ బిజెపి కార్యకర్తలు నాయకులు మున్సిపల్ ఆఫీసు ముట్టడించడంతో పోలీసులు నాన్న తంతాలు పడి వాళ్లను చదరగొట్టారు ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఎన్నికల కమిషనర్ ఎన్నికల అధికారులు చూసుకుంటారని కేవలం శాంతి పద్ధతుల పరిరక్షణ కోసమే తాము పని చేశామని ఎస్పీ సాయికిరణ్ ఉపేంద్ర రెడ్డిలు తెలిపారు తిరిగి ఎన్నిక ఎప్పుడు నిర్వహించేది జిల్లా కలెక్టర్ తో పాటు ఎన్నికల రాష్ట్ర కమిషన్ తెలియజేస్తుందని తెలిపారు.

# అధికారుల తప్పిదంతోటే ఎన్నిక వాయిదా ఎమ్మెల్యే బొజ్జు పటేల్

**ఖానాపూర్ ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి) :** ఎన్నికలు సరైన విధంగా నిర్వహించకుండా ఎన్నికల వాయిదా పడేలా అధికారులు చేశారని తాము అధికారులను బెదిరించలేదని అధికారులను నిలదీశామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా అన్నారు ఎన్నిక ప్రక్రియలో తమ అభ్యర్థికి మద్దతు లభించిన క్రమంలో వెంటనే డిక్లేర్ చేయకుండా అక్షర క్రమం అంటూ ఇతర ప్రతిపక్ష అభ్యర్థి నామినేషన్ ప్రక్రియను ప్రస్తావించగానే సభ్యులు గందరగోళంలో ఇరు వర్గాలకు ఒక సభ్యులు ఓటు వేశారని దీని నిలదీసినందుకే బెదిరించామని తమను ప్రతిపక్షాలు బదనం చేశారని ఆరోపించారు బిజెపి టీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై అధికారం చేజిక్కించుకునే క్రమంలో అనవసర అలజడి సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే బొజ్జపటేల్ ఆరోపించారు.



# ఘనంగా రన్ ఫర్ జీసస్ పోగ్రాం



**జన్నారం, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి) :** జన్నారం మండల ంలో పాస్టర్ శాలేము రాజు ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ పోగ్రాం ను ఘనంగా నిరవహించారు. 'రన్ ఫర్ జీసస్ ఈ కార్యక్రమ ర్యాలీ ని యేసు కొరకు పరుగు అనే నినాదంతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ రన్ ఫర్ జీసస్ ర్యాలీ అనేది యేసు క్రీస్తు మరణం మరియు పునరుత్థానం యొక్క సందేశాన్ని బహిరంగంగా ప్రకటించడానికి, గుడ్ ఫ్రైడే మరియు ఈస్టర్ మధ్య వచ్చే పవిత్ర శనివారం నాడు నిర్వహించబడే ఒక క్రైస్తవ సువార్త మరియు సర్వమత కార్యక్రమం, కానీ రన్ ఫర్ జీసస్ కేవలం ఒక ర్యాలీ మాత్రమే కాదు, ఇది విశ్వాసం, బలం మరియు ఐక్యత యొక్క శక్తివంతమైన వేడుక, ఇది నిరీక్షణ మరియు ప్రేమ సందేశాన్ని వ్యాప్తి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండలంలోని సమస్త క్రైస్తవులు,పాస్టర్స్ అభిషేక్,ధమ్మా శామ్యూల్, క్రిస్టియన్ యూత్ లీడర్స్ మంద రాజేష్,పస్నేట్ పాల్, కొప్పుల రాము,ముగాల అజాయ్ కుమార్, తుడుం ప్రభాకర్, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.


# ఈ నెల 6 నుండి చింతగూడెంలో ఆధార్ స్పెషల్ క్యాంప్



**జన్నారం, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి) :** జన్నారం మండలం చింతగూడెం గ్రామంలో ఈ నెల 6 నుండి 10వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఏ ఎస్ పి రామారావు, గ్రామ సర్పంచ్ సుతారి సుమలత వినయ్ తెలిపారు. ఆధార్ కార్డు లో తప్పొప్పుల సవరణ, ఫోటో అప్డేట్, ఫోన్ నంబర్, అడ్రస్ మార్పు చేసుకోవడం, డేట్ ఆఫ్ బర్త్ సరిచేసుకోవడం లాంటివి అలాగే తదితర సవరణలు చేసుకోవచ్చు అని, చింతగూడెం గ్రామ ప్రజలు, అలాగే చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# క్యాతనపల్లి చైర్మన్‌గా సంధ్యరాణి ఎన్నిక

**– శుభాకాంక్షలు వెల్లువ**



**జైపూర్ ఏప్రిల్ 4 ప్రజా జ్యోతి :** చెన్నూరు నియోజకవర్గం లోని క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్‌గా గొడిసెల సంధ్యరాణి ఎన్నిక కావడంతో స్థానికంగా టిఆర్ఎస్ పార్టీ వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు వివిధ వర్గాల ప్రజలు, నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజా రమేష్ కు కోటపల్లి మండలానికి చెందిన సోషల్ మీడియా ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. బాపు నాయక్, రాజ్ కుమార్ యాదవ్, ఆకుదారి చందు, సంపత్ కుమార్, గారే రాజేష్, దుర్గం తిరుపతి, జంజర్ల ప్రకాష్, లాపాక సంతోష్ తదితరులు కలిసి సంధ్యరాణి ఎన్నికపై హర్షం వ్యక్తం చేస్తూ సన్మానం చేశారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన సంధ్యరాణి పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.పట్టణంలో మౌలిక వసతుల మెరుగుదలతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.సంధ్యరాణి నాయకత్వంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ మరింత అభివృద్ధి సాధిస్తుందని స్థానికులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# నేరడిగొండలో వైద్య శిబిరం

**– అసంక్రమిత వ్యాధులపై అవగాహన**



**నేరడిగొండ, ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రమైన నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) పరిధిలో శనివారం భారీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజలకు వివిధ ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత పరీక్షలు నిర్వహించారు. అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సిడి) స్క్రీనింగ్: గ్రామస్థులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి తగిన జాగ్రత్తలు సూచించారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా ఆసుపత్రిలోనే కాన్పులు చేయించుకోవాలని, తద్వారా తల్లీబిడ్డల క్షేమం సాధ్యమని అవగాహన కల్పించారు.

**క్షయ వ్యాధి నిర్మూలన:**

(టి.బి) లక్షణాలు, చికిత్స మరియు ప్రభుత్వ ఉచిత వైద్య సదుపాయాల గురించి గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సద్దాం పాల్గొని రోగులను పరీక్షించారు. హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (హెచ్ ఈ ఓ) పవార్ రవీందర్, హెల్త్ సూపర్వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి లు ప్రజలకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ శిబిరంలో ఆశా కార్యకర్తలు జయమ్మ, గీత, రజిని మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో మెనూ ప్రకారం ఆహారం తప్పనిసరి

- బీసీ బాలికల హాస్టల్ ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని నాగవరం శివారులో ఉన్న బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం





అందిస్తున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులు అవునని సమాధానం ఇవ్వడంతో, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు కాంపౌండ్ వాల్ లేకపోవడం, పావురాల సమస్యలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు ఫైల్ సిద్ధం చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హాస్టల్ కిచెన్‌ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం మెనూ ప్రకారం అందించాలని వార్డెన్‌కు సూచించారు. వంట కోసం గ్యాస్ సిలిండర్ సౌకర్యం ఉన్నదా అని కూడా వివరాలు తెలుసుకున్నారు. ఈ తనిఖీలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సహాయ బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆంజనేయులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీపై విస్తృత అవగాహన

వనపర్తి, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వనపర్తి విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఫైర్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్



ఫైర్ ఆఫీసర్ చిన్న నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆసుపత్రి సిబ్బందికి వివరించారు. అగ్నిప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలి, ఫైర్ ఎక్విప్‌మెంట్ వినియోగం ఎలా ఉండాలనే అంశాలను ప్రయోగాత్మకంగా ఆసుపత్రి సిబ్బందితో చేయించారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని, అందుకు తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది వై. శ్రీనివాసులు, వి. కురుమయ్య, టి. బాలకొండ, ఎ. అశోక్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల రివిజన్‌కు బీఎల్‌ఏల నియామకం కీలకం: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా ప్రారంభించేందుకు బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. రాజకీయ పార్టీల నుంచి బీఎల్‌ఏల జాబితాను వీలైనంత త్వరగా సేకరించాలని ఆయన ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో




వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులతో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, త్వరలో ప్రారంభమయ్యే ఎస్ ఐ ఆర్ ఆర్ ప్రక్రియలో భాగంగా అన్ని రాజకీయ పార్టీలు బీఎల్‌ఏలను నియమించి వారి జాబితాలను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ పూర్తి చేయాలని, బీఎల్‌ఓలకు ఐడీ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులతో మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఫారం 6, 7, 8లకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డి సెక్షన్ సూపరింటెండెంట్ మదన్, వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఇంటింటికి సిపిఐ

-నిరుపేదలకు ఇండ్లు,అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వాలి

-సిపిఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి టి.నర్సింలు

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, మార్చ్ 31 (ప్రజా జ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని నిరుపేదలైనటువంటి వారందరికీ ఇళ్ల స్థలాలు ఇండ్లు రాష్ట్ర ప్రభుత్వము ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి టి.నర్సింలు అన్నారు. శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ,సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణంలోని ఎల్లమ్మ కుంట వీధిలో సిపిఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి టి.నర్సింలు ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి టి.నర్సింలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న వారందరికీ చాలామందికి ఇళ్ల స్థలాలు లేవని ఇళ్ల స్థలాలు ఉన్న ఇల్లు, అర్హులైన వారికి పెన్షన్స్ రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వము పేద ప్రజలందరి గుర్తించి వారందరికీ ఇళ్ల స్థలాలు ఎన్నో పెన్షన్స్ ఇవ్వాలి ప్రస్తుతము కేంద్ర ప్రభుత్వము కార్పొరేటు శక్తులకు అనుకూలంగా ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్మికులకు రైతులకు హక్కులను కాలరాసే విధంగా చట్టాలను తీసుకొని




వస్తుంది నేడు దేశంలో నెలకొన్న పరిస్థితులలో కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటాలను ప్రజలు ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యకర్తలు మీ సహాయం కోరుతూ మీ వద్దకు వస్తున్నారు. శ్రేయోభిలాషులు వ్యాపారులు అందరూ తమ వంతుగా ప్రజా పోరాటాలకు పార్టీకి చేతనిచ్చి విరాళాలు ఇవ్వగలరని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు సరోజమ్మ, నారాయణమ్మ,కొండయ్య,పద్మ,మాహదేవమ్మ, సుజాత,నర్సింగమ్మ,సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పెబ్బేరు క్రీడలకు కొత్త ఊపు.. రూ.2.5 కోట్లతో అంతర్జాతీయ స్థాయి మైదానం

- క్రీడాకారుల ప్రోత్సాహమే ప్రభుత్వ లక్ష్యం – రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి

పెబ్బేరు, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి): జిల్లాలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను, యువతను ప్రోత్సహిస్తూ క్రీడలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కొత్త కాపు శివసేన రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి పెబ్బేరు మున్సిపాలిటీలో పర్యటించిన ఆయన, స్థానిక పిజెపి క్యాంప్ ఆవరణలో ఉన్న ఖేలో ఇండియా ఫుట్‌బాల్ మైదానాన్ని పరిశీలించారు. క్రీడాకారుల సౌకర్యార్థం కలెక్టర్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైటింగ్ సదుపాయాన్ని పరిశీలించి, జిల్లాలో క్రీడల అభివృద్ధికి కలెక్టర్ చూపుతున్న ప్రత్యేక శ్రద్ధను అభినందించారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోనే తొలిసారిగా జర్మన్ టెక్నాలజీతో పెబ్బేరు ప్రాంతంలో ఒకే ప్రాంగణంలో ఫుట్‌బాల్, హాకీ టర్ఫ్‌లతో పాటు 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం మున్సిపాలిటీకి చెందిన పది ఎకరాల స్థలాన్ని క్రీడా ప్రాధికార సంస్థకు బదిలీ చేస్తే, రూ.2.50 కోట్లతో ఆధునిక మైదానం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, సూచించిన పది ఎకరాల స్థలాన్ని వెంటనే సర్వే చేసి హద్దులు గుర్తించాలని, క్రీడల అభివృద్ధికి కేటాయించేలా మున్సిపాలిటీ తీర్మానం చేయాలని తహసీల్దార్, మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. త్వరలోనే ఖేలో ఇండియా మైదానంలోని హైమాస్ట్ లైటింగ్‌ను ప్రారంభించేలా ఏర్పాట్లు



పూర్తి చేయాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులపై సమీక్ష

పర్యటనలో భాగంగా పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఒక గృహ నిర్మాణాన్ని సందర్శించి లబ్ధిదారుతో మాట్లాడి పనుల పురోగతి, చెల్లింపుల పరిస్థితిని తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించాల్సిన చెల్లింపులు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారుల వివరాల ప్రకారం, మున్సిపాలిటీలో మొత్తం 143 ఇళ్లలో 83 ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తయింది. మిగిలిన ఇళ్ల పనులను త్వరితగతిన ప్రారంభించి లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కృష్ణ కుమార్ రెడ్డి, డివైఎస్‌వో సుధీర్ రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థుల ప్రతిభకు వేదిక

– ఎన్ ఎం ఎం ఎస్ MMSలో మహబూబ్‌నగర్ ఫస్ట్ సత్తా

- మెరిట్ స్కాలర్‌షిప్‌లో 80 మందిలో మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ పొందిన 60 మంది విద్యార్థులకు ఘన సన్మానం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ) గ్రామీణ మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థుల్లో అపార ప్రతిభ దాగి ఉందని, సరైన మార్గదర్శకత్వం ఉంటే వారు దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దగలరని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ మరియు







వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ ఎం ఎం ఎస్ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఫలితంగా విజయం సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో కోహినూర్ వజ్రాల్లాంటి ప్రతిభావంతులైన పిల్లలు ఉన్నారని, వారికి సరైన వాతావరణం, ప్రోత్సాహం అందితే ఐఏఎస్, ఐపీఎస్, ఐఐటీ, డాక్టర్, ఇంజనీర్ వంటి ఉన్నత లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమని అన్నారు. జిల్లాలో ఎన్ ఎం ఎం ఎస్ మెరిట్ స్కాలర్‌షిప్ సాధించిన 80 మందిలో 60 మంది మహబూబ్‌నగర్ ఫస్ట్ ద్వారా శిక్షణ పొందినవారే కావడం గర్వకారణమని పేర్కొన్నారు.

సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన ఈ విద్యార్థుల ప్రతిభ అసాధారణమని, వీరిని సమాజం కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమానికి ఎన్ఆర్ఐలు సహా మరింత మద్దతు లభిస్తుందని, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మహబూబ్‌నగర్‌కు భౌతిక సంపదలు తక్కువైనా, పిల్లల తెలివితేటలే అసలు సంపద అని పేర్కొంటూ, ప్రతి ఇంట్లో ఒక "కోహినూర్ వజ్రం" ఉందని తెలిపారు. విద్యార్థి జీవితంలో 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉన్న ఐదు సంవత్సరాలు కీలకమని, ఈ దశలో క్రమశిక్షణ, మార్గనిర్దేశం ఉంటే అద్భుత ఫలితాలు సాధ్యమని వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలపై ఆధారపడాల్సిన అవసరం లేదని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బలోపేతం చేస్తూ, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

గత కోచింగ్ కార్యక్రమాల ద్వారా 116 మంది విద్యార్థులు ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చర్ వంటి కోర్సుల్లో ఉచిత సీట్లు సాధించారని గుర్తుచేశారు. రీజనింగ్, ఇంగ్లీష్ శిక్షణ ద్వారా పోటీ పరీక్షలకు బలమైన పునాది వేస్తున్నామని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.

అనంతరం మెరిట్ స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, విద్యా అధికారులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# గురులోక్ మాసంధ్ ప్రభు (బావోజీ ) ని దర్శించుకున్న జిల్లా కలెక్టర్

నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 04 (ప్రజా జ్యోతి)

నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డి పల్లి లో గత మూడు రోజులుగా కొనసాగుతున్న శ్రీ గురు లోక్ మాసంద్ ప్రభు ( బావోజి) జాతర బ్రహ్మోత్సవాలకు శనివారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ హాజరయ్యారు. బ్రహ్మోత్సవాల పర్యవేక్షణ అధికారి/ఆర్డీవో రామచందర్ నాయక్, ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్ కు గౌరవ పూర్వక స్వాగతం పలికారు. అనంతరం గురు లోక్ మాసంద్ ప్రభును, పక్కనే ఉన్న కాళికా దేవి మాత ను కలెక్టర్ దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కమిటీ సభ్యులు కలెక్టర్ ను ఆర్డీవో ను సన్మానించారు. కాగా జాతర ఏర్పాట్లపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం వరకు జాతర ఉత్సవాలు ముగుస్తాయనీ, అధికారులంతా జాతర ముగిసే వరకు దగ్గరుండి పర్యవేక్షణ చేయాలని సూచించారు. అలాగే భక్తులందరూ తిరిగి వారి వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా వాహన రాకపోకలను సజావుగా కొనసాగించాలని, జాతర ముగిసే వరకు పటిష్ట బందోబస్తు నిర్వహించాలని కలెక్టర్ పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మొగులప్ప, డిపివో సుధాకర్ రెడ్డి, డీపీఆర్ వో రషీద్, తహశీల్దార్ జయరాములు, మద్దూరు, కొత్తపల్లి ఎంపీడీవోలు, సీఐ సైదులు పాల్గొన్నారు.



# బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం చేపట్టాలి:రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

గద్వాల ఏప్రిల్ 04(ప్రజా జ్యోతి ప్రతినిధి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు.శనివారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాదు నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ




సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మండలాల వారీగా ఇప్పటికే ఏఈఆర్ఓ లకు,బూత్ లెవెల్ అధికారులకు బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకంపై సమావేశాలు చేసినందున ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతంకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు.రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు చేయనిచోట వెంటనే నిర్వహించాలన్నారు.బూత్ లెవెల్ అధికారుల యాప్ పై అవగాహన కలిగి ఉండాలని,మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు.గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడుతూ,ఎస్ఐఆర్ ప్రక్రియ జిల్లాలో 74 శాతానికి చేరుకుందని,మరింత వేగవంతం కావడానికి కృషి చేయాలన్నారు.గద్వాల మున్సిపాలిటీ పరిధిలో ప్రక్రియ కాస్త వెనుకబడిందని, వేగవంతం చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ,ఆర్డీవో శ్రీనివాసరావు,ఎన్నికల అధికారి మంజుల,సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్‌లపై ఎస్పీ కఠిన హెచ్చరిక

గద్వాల ఏప్రిల్ 04(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో యువతను దారి తప్పిస్తున్న క్రికెట్ బెట్టింగ్‌లపై జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు, గట్టిగా హెచ్చరించారు.తక్కువ సమయంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో కొందరు యువకులు అక్రమ కార్యకలాపాల వైపు ఆకర్షితులవుతున్నారని,ఇది వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నదని పేర్కొన్నారు.క్రికెట్ బెట్టింగ్‌ల కారణంగా యువత ఆర్థికంగా



దెబ్బతిని,అప్పుల బారిన పడి,తీవ్ర నిరాశకు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.కొన్ని సందర్భాల్లో ఇవి ఆత్మహత్యల వరకు దారితీసే ప్రమాదం ఉందని,కుటుంబాలు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు.క్రికెట్ బెట్టింగ్ పూర్తిగా చట్ట విరుద్ధమని,ఇందులో పాల్గొనే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.బెట్టింగ్ నిర్వహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి మోసపూరిత మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు.క్రికెట్‌ను కేవలం వినోదంగా మాత్రమే చూడాలని,అక్రమ సంపాదనకు ఉపయోగించకూడదని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని,వారి రోజువారీ కార్యకలాపాలను గమనించాలని సూచించారు.మ్యాచ్‌ల సమయంలో అనుమానాస్పద మార్పులు గమనిస్తే వెంటనే అప్రమత్తంగా ఉండాలని కోరారు.క్రికెట్ బెట్టింగ్,ప్లేయింగ్ కార్డ్స్,బెట్టింగ్ యాప్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని,సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు."బెట్టింగ్‌లతో జీవితాలు,కుటుంబాలను నాశనం చేసుకోకండి"అంటూ జిల్లా ఎస్పీ ప్రజలకు,ముఖ్యంగా యువతకు పిలుపునిచ్చారు.

# గ్రామాభివృద్ధిపై అదనపు కలెక్టర్ దృష్టి - పనుల్లో నాణ్యత, వేగం అవసరం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 4 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని బొక్కలోనిపల్లి గ్రామంలో



శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పర్యటించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రయోజనం చేకూరేలా సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన సూచించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన మండల బిఆర్ఎస్ నాయకులు



**పలిమెల ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమేల మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన తిప్పన పెల్లి రమేష్ ఇటీవలే జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే కాగా వారి కుటుంబాన్ని మండల బిఆర్ఎస్ నాయకులు ఆర్థిక సహాయం అందించారు. సర్వాయి పేట గ్రామానికి చెందిన తిప్పిన పెల్లి రమేష్ రోడ్డు ప్రమాదం లో మృతి చెందిన విషయం విదితమే కాగా వారి కుటుంబానికి మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఆలం సత్యనారాయణ మరియు మండలం యూత్ అధ్యక్షులు లంగారి రవీందర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మృతుని భార్య సమ్మక్క కు 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించి మృతుని కుటుంబానికి ఆపదలో ఆదుకుంటామని భరోసాగా కల్పించడం తో పాటు మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వాయి పేట గ్రామశాఖ అధ్యక్షులు సప్పిడి మాంతయ్య, కల్లురి వెంకట్, లంగారి లక్ష్మయ్య, దుర్గం నల్లగొండ, కుమ్మరి మహేష్, తిప్పనపల్లి రవీందర్, సప్పిడి యేసయ్య, జనగాం రామ్మూర్తి, కల్లురి సాగర్, జనగాం సమ్మయ్య, తిప్పనపల్లి రాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుండి కరెంట్ కట్

**చెన్నారావుపేట ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి) :** చెన్నారావుపేట మండల పరిధి సెక్షన్ లోని ఉప్పరపల్లి సబ్ స్టేషన్‌లో శనివారం మరమ్మతుల కారణంగా కోనాపురం లింగాపురం ఉప్పరపల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయబడుతుందని ఆయా గ్రామాల ప్రజలు సహకరించగలరని ఏఈ సంపత్ కోరారు.

## శ్మశాన వాటికలో నూతన బోర్ మోటార్ ఏర్పాటు



**చెన్నారావుపేట ఏప్రిల్ 03 (ప్రజా జ్యోతి) :** మండల పరిధిలోని పాపయ్యపేట గ్రామంలో శ్మశాన వాటికలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్ శుక్రవారం శ్మశాన వాటిక వద్ద నూతనంగా బోర్ ఫ్రెస్సింగ్ చేయించి, కొత్త మోటార్‌ను బిగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని వైకుంఠధామానికి వచ్చే వారికి నీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాత బోర్ మరమ్మతులకు గురికావడంతో వెంటనే స్పందించి కొత్త మోటార్ వేయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగాల సారంగం, వార్డు సభ్యులు మరపల వీరాస్వామి, గుర్రం రవి, టేకుల స్వామి, కుండే శ్రీశైలం, బర్ల యాకయ్య, కుండే భద్రయ్య, గోపగాని వేణు, కుండే కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్లో సమస్యల పరిష్కారానికి వార్డుసభ

**– 42వ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్**



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 03(ప్రజాజ్యోతి) :** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమానంగా అమలు చేస్తున్నదని 42 వడివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ అన్నారు. శుక్రవారం 42 వడివిజన్ రంగశాయిపేట లోని మహంకాళి గుడి ఆవరణలో కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ అధ్యక్షతన వార్డు (గ్రామ) సభ సమావేశం జరిగినది. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ డివిజన్లో ఇప్పటివరకు 166 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించడం జరిగినదని, ఇంకా మంజూరు అయ్యేటివి ఉన్నాయని, అంతేకాకుండా 1304 మంది వృద్ధులు, వితంతు, వికలాంగుల పెన్షన్లను అప్రూవల్ చేయించి పెట్టామని త్వరలోనే ప్రభుత్వం వాటిని మంజూరు చేస్తుందని అన్నారు. మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి ల సహకారంతో అభివృద్ధి విషయంలో డివిజన్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు దాదాపు పూర్తి చేయించడం జరిగినదని తెలిపారు. మిగిలిన పనులను పూర్తి స్థాయిలో మంజూరు చేయిస్తామని అన్నారు. ఈ వార్డు సభలో డివిజన్ అధికారి మధు, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు దామెరకొండ కర్ణాకర్, మజ్జిగ తిరుమల్, కందగట్ల హరిత, స్థానిక పెద్దలు ముత్తినేని రామ మూర్తి, బోలుగొద్దు అనిల్, పాలకుర్తి సుమన్, ఆవునూరి కుమార్, విలాసాగరం శ్రీనివాస్, కర్ర కుమార్, జింక రమేష్, పాల రంజిత్, సయ్యద్ బషీర్, మును కుంట్ల చంద్రమౌళి, వనం వేణు, బండ్ల ప్రవీణ్, కంచ మల్లయ్య, మునుకుట్ల విజయ, చిట్ల హేమలత, కానుగంటి పద్మ, అంబటి రమ, శానిటరీ జవాన్లు అశోక్, ప్రణీత్ లతో పాటు మెప్మాకు చెందిన ఆర్పిలు, ఓబిలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా ఉద్యోగులు, విద్యుత్ సిబ్బంది మరియు ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్ననాటి స్నేహితురాలికి అండగా పదో తరగతి మిత్రబృందం

**– చిన్ననాటి మిత్రులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు.**

**– ఆర్థిక సహాయంగా రూ. 25,500 అందజేత**



**చెన్నారావుపేట ఏప్రిల్ 03 (ప్రజా జ్యోతి) :** ఆర్థిక ఇబ్బందులతో తనువు చాలించిన స్నేహితురాలి కుటుంబానికి మేమున్నామంటూ చిన్ననాటి మిత్రులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. చెన్నారావుపేట గ్రామానికి చెందిన కోరే రజిత భర్త శ్రీనివాస్ ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తాళలేక గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద వార్త తెలుసుకున్న రజిత చిన్ననాటి స్నేహితులు 2006-2007 పదవ తరగతి బ్యాచ్ స్పందించారు. కష్టాల్లో ఉన్న తమ స్నేహితురాలిని ఆదుకోవాలని నిర్ణయించుకున్న మిత్రబృందం, తమ వంతుగా 25,500 రూపాయల నగదును సేకరించి శుక్రవారం బాధితురాలికి అందజేశారు. మృతుడు శ్రీనివాస్‌కు ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె ప్రస్తుతం పదవ తరగతి పూర్తి చేసుకోగా ఆమె పైచదువుల నిమిత్తం అయ్యే ఖర్చులను తామే భరిస్తామని మిత్రబృందం ఈ సందర్భంగా హామీ ఇచ్చింది. రజితకు మనోధైర్యాన్ని కల్పిస్తూ భవిష్యత్తులోనూ అండగా ఉంటామని స్నేహితులు మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాదాసి రమేష్, సింగారపు సునీల్, మండ విక్రమ్, నాగరాజు, షేక్ ఇమామ్, గొట్టే రాజేందర్, దామోదర చారి, రజిని, శిరీష, స్వరూప, రజిత, నాగవేణి, రమ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లాపూర్‌లో ప్రభుత్వ భూముల కబ్జాపై ఆందోళన

**భూములను రక్షించాలని**

**సిపిఐ జాతీయ కమిషన్ అధ్యక్షునికి వినతి**



**హసన్‌పర్తి, ఏప్రిల్ 3(ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తి మండలంలోని ఎల్లాపూర్ గ్రామంలో ప్రభుత్వానికి చెందిన అంగడి స్థలం, చేపల కేంద్రం భూములు భూ కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములను తిరిగి ప్రభుత్వ స్వాధీనం చేసుకోవాలని కోరుతూ సిపిఐ జాతీయ నియంత్రణ కమిషన్ అధ్యక్షుడు కె. నారాయణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబరు 246/1లో 12 ఎకరాల 13 గుంటల విస్తీర్ణంలో చేపల బావి, కలగిరి బంగ్లా ఉండేవని తెలిపారు. రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై భూ కబ్జాదారులు ఈ భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అలాగే సర్వే నంబరు 316లో సుమారు 4 ఎకరాల 16 గుంటల విస్తీర్ణం గల అంగడి స్థలాన్ని 1970లో గ్రామపంచాయతీ అప్పటి యజమాని నుండి చెల్లింపులు చేసి స్వాధీనం చేసుకుందని వివరించారు. 1973 నుంచి అక్కడ అంగడి కొనసాగుతూ వచ్చిందన్నారు. అయితే పహాణి నమోదు ప్రకారం ప్రభుత్వ అంగడి భూమిగా ఉండగా, 2022లో ధరణి విధానం లోపాలను ఉపయోగించుకుని వారసులు అక్రమంగా పట్టా పొందినట్లు తెలిపారు. ఆ స్థలంలో ప్రభుత్వ పశువైద్యశాల, పాఠశాల ఆటస్థలం ఏర్పాటు చేసినప్పటికీ స్థానికులతో కలిసి కబ్జాదారులు ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ రికార్డుల్లో గ్రామపంచాయతీ పేరుతో ఉన్న భూమిని అక్రమంగా పట్టా చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, భూమిని తిరిగి ప్రభుత్వంగా గుర్తించి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఎమ్మార్వో, ఆర్డీవో, కమిషనర్, కలెక్టర్, ముఖ్యమంత్రి శిబిర కార్యాలయాలకు కూడా వినతులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమస్యపై త్వరగా చర్యలు తీసుకోకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆ భూములను పేదలకు పంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తాక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, సీనియర్ నాయకుడు మోతేలింగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, భూముల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల ఉపాధిని దెబ్బ తీయొద్దు

- రాష్ట్ర చేనేత ఐక్య వేదిక మీడియా కార్యదర్శి లింగమూర్తి
- రూ.105 కోట్ల టెండర్ రద్దుతో చేనేత కార్మికులకు ఉపాధి లేకుండా పోతుంది



**నర్సంపేట ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి) :** ప్రభుత్వం ఏటా టెస్కో (తెలంగాణ చేనేత సహకార సంఘం)కు ఇచ్చే ఆర్డర్లను రద్దు చేయడం సమంజసం కాదని రాష్ట్ర చేనేత ఐక్య వేదిక మీడియా కార్యదర్శి లింగమూర్తి అన్నారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. 2026-27 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు యూనిఫామ్ తయారీ కోసం టెస్కోకు ఇచ్చే రూ.105.54 కోట్ల ఆర్డర్ను రద్దు చేయడం అంటే చేనేత కార్మికుల ఉపాధిని దెబ్బ కొట్టడమే అని పేర్కొన్నారు. అలాగే వివిధ సంక్షేమ శాఖల నుంచి వచ్చే ఆర్డర్లను సైతం ఇవ్వకపోవడంతో చేనేత కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. దశాబ్దాలుగా విద్యాశాఖ, సంక్షేమ శాఖల పరిధిలోని విద్యార్థులకు దుస్తులు కుట్టిచ్చే బాధ్యతను చేనేత సహకార సంఘమే చూస్తుండగా ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చేనేత కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఏటా జనవరిలో వచ్చే ఆర్డర్ ఏప్రిల్ వచ్చినా రాకపోవడంతో కార్మికులు ఆదాయం కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు యూనిఫామ్ కుట్టే ఆర్డర్లను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాల్లో కార్మికులకు సరైన పని లేక ఆందోళన చెందుతుండగా, ప్రభుత్వం సైతం ఇచ్చే ఆర్డర్లను విరమించుకోవడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి టెస్కోకు ఆర్డర్లు ఇచ్చేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల నుంచి వచ్చే ఆర్డర్లను చేనేత సంఘాలకు అప్పగించి వారి ఆర్థిక పురోగా అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# వైభవంగా హనుమాన్ శిఖర కలశ ప్రతిష్టాపన

**మనుబోతుల కుటుంబ సభ్యుల దాతృత్వంతో ఆధ్యాత్మిక శోభ**



**నెక్కొండ ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి) :** నెక్కొండ గ్రామ శివారులోని సిక్కుల గురుద్వార ప్రాంగణంలో కొలువైన ఆంజనేయస్వామి ఆలయం శుక్రవారం ఆధ్యాత్మికతతో విరాజిల్లింది. అత్యంత వైభవంగా జరిగిన శిఖర కలశ ప్రతిష్టాపన మహోత్సవం భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా సాగింది. ఈ విశిష్ట కార్యక్రమానికి మండల కేంద్రంలోని గుండ్రపల్లి గ్రామానికి చెందిన మనుబోతుల కుటుంబ సభ్యులు భక్తిభావంతో ఆలయ శిఖర కలశాన్ని సమకూర్చడం విశేషం. ఈ మహత్తర క్రతువుకు నెక్కొండకు చెందిన అర్చక పురోహితులు బివిఎన్ శాస్త్రి, వేద జ్యోతిష పండితులు శ్రవణ్ కుమార్ శాస్త్రి, అర్చకులు గోపాలకృష్ణమూర్తి శర్మ శాస్త్రోక్తంగా సారథ్యం వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలో వేద మంత్రోచ్ఛారణలు మారుమోగాయి. గణపతి పూజతో మొదలై పుణ్యాహవాచనం, నవగ్రహ అష్టదిక్పాలక పంచలోకపాలక పూజలు, వాస్తు మండపారాధన వంటి విశేష అర్చనలు శాస్త్రబద్ధంగా నిర్వహించారు. అదేవిధంగా శ్రీ మహాకాళీ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహా సరస్వతి సమేత గౌరీ మరియు క్షేత్రపాలక పూజలతో పరిసరాలన్నీ దైవచింతనతో పులకించిపోయాయి. ఆవాహిత దేవతలకు భక్తితో హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం అత్యంత వైభవంగా హనుమంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద మంత్రాల సాక్షిగా శిఖర కలశాన్ని ప్రతిష్ఠించి కుంభాభిషేకం గావించారు. కలశోద్వాసన మరియు పండితుల వేద ఆశీర్వచనాలతో ఈ ఆధ్యాత్మిక వేడుక ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా స్వామివారి మాలధారులకు మరియు భక్తులకు భారీ స్థాయిలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో మనుబోతుల పూర్ణచంద్రారెడ్డి విజయలక్ష్మి దంపతులు, మనుబోతుల వీరారెడ్డి రమణారెడ్డి దంపతులతో పాటు నాగేంద్రమ్మ, సిక్కు గురుద్వార ప్రతినిధులు దర్బార్ సింగ్, ప్రేమ్ సింగ్ మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# శివాజీ మహారాజ్ మార్గం యువతకు ప్రేరణ

**– శివాజీ సేనా ప్రతినిధి రావుల నరేష్ – రంగశాయిపేటలో శివాజీ మహారాజ్ వర్ధంతి**



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 03(ప్రజాజ్యోతి) :** శివాజీ మహారాజ్ చూపిన మార్గం యువతకు ప్రేరణగా నిలుస్తుందని శివాజీ సేనా ప్రతినిధి రావుల నరేష్ అన్నారు. మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, ధైర్యసాహసాలకు ప్రతీక అయిన చత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని శుక్రవారం దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అందులో భాగంగా వరంగల్ నగరంలోని రంగశాయిపేటలో ఆరెకటిక సంఘం, రంగశాయిపేట యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూల మాలలు వేసినివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రావుల్కార్ నరేష్ మాట్లాడుతూ.. 1680లో ఏప్రిల్ 3 నా పరమపదించిన శివాజీ మహారాజ్ సేవలను స్మరించుకుంటున్నామని అన్నారు. మహారాష్ట్రలోని రాయగఢ్ కోటలో ఉన్న ఆయన సమాధి వద్ద రాజకీయాలకు పార్టీలకు అతీతంగా దేశం భక్తులు అంతా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యం, నాయకత్వం ప్రతి భారతీయుడికి ఆదర్శమని పేర్కొన్నారు. స్వరాజ్యం సాధన కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు శివాజీ మహారాజ్ జీవితం, విలువలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఎలా బ్రతుకాలో తండ్రి నేర్పితే ఎలా మరణించాలో కొడుకు శంబాజీ నేర్పించి భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని నాశనం కాకుండా అడ్డుపడిన యోధులకు దేశం ఎప్పుడు రుణ పడే ఉంటుందని అన్నారు. త్వరలోనే శివాజీ, శంబాజీ మహారాజ్ ల విగ్రహాలను ప్రతిష్టించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో రావుల నవీన్, కొట్టె వినయ్ కుమార్, రావుల సురేష్, మండల మొగిలి, దేవులపల్లి శ్రీనాథ్, కర్నె రవీందర్, బక్కి రంజిత్, ఆరె కార్తీక్, రావుల మహేష్, శివగణేష్, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



**వర్ధన్నపేట, ఏప్రిల్ 3, ప్రజాజ్యోతి :** గుడ్ ఫ్రైడే వేడుకలను పురస్కరించుకుని వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని 800 మంది చర్చి సభ్యులకు మజ్జిగ పంపిణీ చేసిన వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి. అనంతరం సంఘ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ఏసుక్రీస్తు మార్గంలోనే అందరూ నడవవలసిన అవసరం ఉన్నది ఏసుక్రీస్తు మనసు వలె అందరి మనసులు ఉండాలని వారి మాదిరిగా జీవించాలని, ఏసుక్రీస్తు దయవల్ల మున్సిపాలిటీ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అభివృద్ధి చెందాలని చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఆకాంక్షించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎన్ ఐ సి జి ఎస్ చర్చి కోసం పాలిష్ బండ ఇప్పియడం జరిగింది చర్చిలో ఉన్నవారు ఇండ్ల కోసం పింఛన్ల కోసం తమను సంప్రదించాలని మీ అందరి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా మీకు ఏ సాయం కావాలన్నా నిరంతరం అందుబాటులో ఉంటానని చైర్మన్ పాలకుర్తి సారంగపాణి తెలిపారు చర్చి పనుల విషయములో నా సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఐ సి జి ఎస్ చర్చి సంఘ పెద్దలు కొండేటి వెంకన్న, కొండేటి కుమారస్వామి, సిలువేరు ఆనందం, గాయల సుమన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈగ దామోదర్, ఒకటో డివిజన్ కౌన్సిలర్ బెజ్జం పాపారావు, పన్నెండవ డివిజన్ కౌన్సిలర్ తిరుపతి వాణి కుమారస్వామి సోషల్ మీడియా పట్టణ, మండలం కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ తుమ్మల కుమారస్వామి సోషల్ మీడియా వెలసారపు వెంకట్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తిలో గుడ్ ఫ్రైడే ఆచరణలు భక్తిశ్రద్ధలతో

**సిలువను మోసిన భక్తులు భక్తిశ్రద్ధలతో శోభయాత్ర**



**ఎల్కతుర్తి ఏప్రిల్ 03 (ప్రజా జ్యోతి) :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించారు. యేసు క్రీస్తు సిలువ వేయబడిన దినాన్ని స్మరించుకుంటూ ఫాదర్ జనార్ధన్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ప్రాంగణం నుంచి సహాయ మాత 14వ స్థలం వరకు వే అఫ్ ది క్రాస్ శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సిలువను మోస్తూ ప్రార్థనలు చేస్తూ ముందుకు సాగారు. మార్గమధ్యంలోని ప్రతి స్థలంలో యేసు క్రీస్తు అనుభవించిన బాధలను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సహాయ మాత వద్దకు చేరుకుని సమూహంగా ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయరాజు, సిస్టర్స్ గ్రామ పెద్దలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

**దొడ్డి కొమురయ్య ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శం**



**హనుమకొండ: ఏప్రిల్ 03 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ ఆయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలను శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె. రవి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దొడ్డి కొమురయ్య ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో సమానత్వం, సామాజిక న్యాయం సాధనలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మణ్, 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆసనాల శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బట్టి శ్యాంప్రసాద్ యాదవ్, బీసీ--ఎస్సీ ఉమ్మడి జిల్లా చైర్మన్ ప్రొఫెసర్ చిన్న మల్లయ్య, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సన్యాసి శ్రీనివాస్, గొర్ల కాపరుల సంఘం అధ్యక్షుడు వేల్పుల రమేష్, కురుమ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచు ప్రభాకర్, దొడ్డి కొమురయ్య కుటుంబ సభ్యులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఈస్టర్ పండుగ వేడుకలకు మంత్రికి ఆహ్వానం



**వరంగల్ సిటీ, ఏప్రిల్ 03 (ప్రజాజ్యోతి) :** ఈస్టర్ పండుగను పురస్కరించుకుని నగరంలోని పోతన నగర్ రోడ్ న్యూ బాబి ఫంక్షన్ హాల్ ఎదురుగా గల పెంతకోస్తు చర్చి లో నిర్వహించనున్న ప్రత్యేక ప్రార్థనలు మరియు వేడుకలకు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ను చర్చి సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా 42 డివిజన్ లెనిన్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మజ్జిగ తిరుమల్ ఆధ్వర్యంలో చర్చి ప్రతినిధులు మంత్రిని కలసి, ఈస్టర్ పండుగ యొక్క ప్రాధాన్యతను వివరించి, విశేష కార్యక్రమాలకు హాజరవ్వాలని కోరారు. ఈ సందర్భంగా తిరుమల్ మాట్లాడుతూ ఈస్టర్ అనేది క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన పండుగగా భావించబడుతుందని, యేసుక్రీస్తు పునరుత్థానం గుర్తుగా విశేష ప్రార్థనలు, గీతాలు, ఆధ్యాత్మిక సందేశాలు నిర్వహిస్తామని తెలిపారు. పండుగ రోజున విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేయనున్నారు. సమాజంలో శాంతి, ఐక్యత నెలకొల్పడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ జాషువా, చర్చి సభ్యులు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బాలవికాస ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**– ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు**

**– సర్పంచ్ చిన్నపాక రజిత రాంబాబు**



**రాయపర్తి ఏప్రిల్ 3 ప్రజాజ్యోతి :** తొర్రూరు బాల వికాస సెంటర్‌లోని సన్నూరు గ్రామంలో శుక్ర వారం బాలవికాస ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిన్నపాక రజిత రాంబాబు మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రయాణికుల కోసం దాహార్తిని తీర్చేటందుకు చలివేంద్రం చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఎంతో మంది ప్రాణాలు కాపాడడానికి ఉపయోగపడుతుందని వేసవికాలం మూడు నెలలు చలివేంద్రం నడిచేలా అన్ని రకాల ఏర్పాట్లు చేసామని అన్నారు ఈ సందర్భంగా బాలవికాస సంస్థకి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బాలవికాస మెయిన్ కోఆర్డినేటర్ ఎం రమ, కోఆర్డినేటర్ ఇన్ సరిత ఉపసర్పంచ్ చీకటి కరుణాకర్ వార్డ్ మెంబర్ మనిషా గ్రామ పెద్దలు కారోబార్ బాలవికాస మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భీమ్ దీక్ష ఆరోగ్య జాతరను విజయవంతం చేయండి

### స్వేరో నెట్వర్క్ జిల్లా అధ్యక్షుడు బొల్లికొండ వీరస్వామి

తుంగతుర్తి, ఏప్రిల్ 4,(ప్రజా జ్యోతి): నేడు సూర్యాపేట జిల్లా కేంద్రంలో స్వేరో నెట్వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించే భీమ్ దీక్ష ఆరోగ్య జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్వేరో నెట్వర్క్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బొల్లికొండ వీరస్వామి పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.... దేశ చరిత్రలో ప్రజా సంక్షేమానికై డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్



కుమార్ ఆదేశించిన మార్గంలో పయనిస్తూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పాటుపడతామన్నారు. భీమ్ దీక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య జాతరను విజయవంతం చేయడం ద్వారా ప్రజల్లో అక్షరం, ఆరోగ్యం, ఆర్థిక చైతన్యాన్ని పెంపొందించడం, మరియు అంబేద్కరిజం స్ఫూర్తితో సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఐపీఎస్ (రిటైర్డ్) ముఖ్య అతిథులుగా హాజరయ్యే ఈ కార్యక్రమానికి స్వేరో నెట్వర్క్ చీఫ్ కన్వీనర్ బల్గురి దుర్గయ్య, వైస్ చైర్మన్ బాల ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు చిలక బత్తినీ వీరయ్య, జనరల్ సెక్రెటరీ దారమల్ల ప్రకాష్, హాజరుకానున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో స్వేరో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చ నరసయ్య,జిల్లా నాయకులు దాసరి శ్రీను, కొండగడుపుల ఎల్లయ్య, చెరుకుపల్లి లక్ష్మణ్, బొడ్డు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి: సర్పంచ్ మనోజ్ మనోజ్

తుంగతుర్తి, ఏప్రిల్ 4,(ప్రజా జ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని సర్పంచ్ చింతకుంట్ల మనోజ్ తల్లిదండ్రులను కోరారు. శనివారం మండల పరిధిలోని




రావులపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నడిగూడెం గ్రామాన్ని నియోజక వర్గం ప్రకటించాలి



నడిగూడెం, ఏప్రిల్ 4 ,ప్రజా జ్యోతి: కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా నడిగూడెం మండలాన్ని ప్రత్యేక నియోజకవర్గంగా ప్రకటించాలని విద్యార్థి నాయకుడు బెల్లంకొండ నవీన్ డిమాండ్ చేశాడు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ—— కేంద్ర ప్రభుత్వం తీసుకున్న డీలిమిటేషన్ విధానం శుభపరిణామం అని పేర్కొన్నారు.అదేవిధంగా, చారిత్రక ప్రాధాన్యత కలిగిన నడిగూడెం కోటకు సరైన గుర్తింపు లభించకపోవడం బాధాకరమని తెలిపారు. ఆనాటి నడిగూడెం రాజా నాయని వెంకట రంగారావు ఆస్థానంలో పనిచేసిన పింగళి వెంకయ్య భారత జాతీయ కాంగ్రెస్ సభలో నడిగూడెం కోట నుంచే జాతీయ జెండా రూపకల్పన చేసి సమర్పించిన విషయం గర్వకారణమని గుర్తుచేశారు. అనంతరం ఆ జెండాలో కొన్ని మార్పులు చేర్పులు చేసి మన జాతీయ జెండాగా రూపుదిద్దుకుంది.ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న నడిగూడెం మండలానికి ఇప్పటివరకు తగిన ప్రాధాన్యత దక్కకపోవడం విచారకరమని యువకుడు అన్నారు.ఈ నేపథ్యంలో నడిగూడెం మండలాన్ని నియోజకవర్గంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు తన డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. నడిగూడెం మండలాన్ని నియోజకవర్గంగా ప్రకటిస్తే, భారతదేశానికి జాతీయ జెండా అందించిన ఈ ప్రాంతానికి తగిన గుర్తింపు, ప్రాధాన్యత లభిస్తుందని అన్నారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి

### ఆత్మకూర్‌లో యువతకు సర్పంచ్ హెచ్చరిక

ఆత్మకూర్ ఎం మార్చ్ 4 (ప్రజా జ్యోతి): ఆత్మకూర్ మండల కేంద్రంలోని వివిధ హోటళ్లలో అలాగే ప్రజలు ఎక్కువగా చేరే ప్రదేశాల్లో కొంతమంది యువత ధూమపానం చేస్తూ చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ధూమపానం మద్యపానం డ్రగ్స్ ఇతర మదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.అలాగే మన గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు యువత ముందుకు రావాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.



# క్రమశిక్షణే విజయానికి తొలిమెట్టు

**పిల్లల భవిష్యత్తుకు తల్లిదండ్రుల సహకారం అవసరం**

**ఘనంగా టీ విత్ ప్రిన్సిపల్ కార్యక్రమం**

**తల్లిదండ్రులకు కీలక సూచనలు చేసిన**

**బీసీ గురుకుల ప్రిన్సిపల్ రవికుమార్**

నాగార్జునసాగర్ ,ఏప్రిల్ 4,ప్రజా జ్యోతి: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నాగార్జునసాగర్ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్



రవికుమార్ అన్నారు.శనివారం పాఠశాల ఆవరణలో ఆయన అధ్యక్షతన టీ విత్ ప్రిన్సిపల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖి మాట్లాడి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం పలు కీలక సూచనలు చేశారు.పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలి ప్రతి విద్యార్థి సమయపాలన పాటిస్తూ క్రమశిక్షణను అలవరుచుకునేలా ఇంట్లో కూడా ప్రోత్సహించాలని సూచించారు.ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించేలా వారిలో పట్టుదలను పెంచాలన్నారు.విద్యార్థుల చదువుపై పాఠశాల ఉపాధ్యాయులు తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను వివరిస్తూ,తల్లిదండ్రుల సహకారం కూడా తోడైతే మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణ తీరుపై సంతోషం వ్యక్తం చేశారు,గతంలో కంటే ఇప్పుడు పాఠశాలలో వసతులు మెరుగుపడ్డాయని,ముఖ్యంగా ప్రిన్సిపల్ రవికుమార్ విద్యార్థుల పట్ల చూపుతున్న వ్యక్తిగత శ్రద్ధను అభినందనీయమని కొనియాడారు,భోజన సౌకర్యాలు,వసతి మరియు విద్యా బోధన విషయంలో తీసుకుంటున్న ప్రత్యేక జాగ్రత్తల వల్ల తమ పిల్లల్లో సానుకూల మార్పు కనిపిస్తోందని వారు ఈ సందర్భంగా తెలిపారు,ఈ కార్యక్రమంలో ఏటీపీ సరిత,జ్యోతి, గాయత్రి, సత్యవతి,సరళ, నూర్జహాన్, రషీద, అరుణ,తిరుపతి,గణేష్ శ్రీనివాసరావు సాంబశివరావు,మల్లికార్జున రావు,జానకి రాములు,యాదగిరి,కిరణ్ కుమార్ తదితర ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కోదాడలో దారుణం..

**కిట్స్ కాలేజీ భవనం పై నుంచి దూకిన యువతి.. తీవ్ర గాయాలు**

**కోదాడలో కలకలం**

**బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం**

**విషాదం ముసురుకున్న కోదాడ..**

**ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం కలకలం**

కోదాడ టౌన్, ఏప్రిల్ 04 (ప్రజా జ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో శుక్రవారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సివిల్ ఫైనల్ ఇయర్ చదువుతున్న బూరుగు మైనా (22) అనే విద్యార్థిని కళాశాల భవనం పై అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.ఈ ఘటనలో ఆమె తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో సహచర విద్యార్థులు, కళాశాల సిబ్బంది వెంటనే స్పందించి సమీపంలోని ప్రైవేట్



ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు, వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.విద్యార్థిని ఈ తీవ్ర నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. వ్యక్తిగత సమస్యలా? చదువులో ఒత్తిడా? లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.మైన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందినదిగా తెలిసింది. ఈ ఘటనతో కళాశాల పరిసరాల్లో ఆందోళన వాతావరణం నెలకొంది. విద్యార్థులు తీవ్ర షాక్‌కు గురయ్యారు.ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.విద్యార్థులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడి,






వ్యక్తిగత సమస్యలు ఇలాంటి ఘటనలకు దారితీస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యాసంస్థలు, తల్లిదండ్రులు విద్యార్థుల మానసిక స్థితిపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. కోదాడ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మరణ వాగ్మూలం తీసుకున్న తర్వాత. ఆమెను హైదరాబాదు లోనీ ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

## పోలీస్ అమరవీరులకు ఘన నివాళి

ఆత్మకూర్ ఎం మార్చ్ 4 (ప్రజా జ్యోతి): స్థానిక ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సై సిద్దయ్య కానిస్టేబుల్ నాగరాజు మోత్కూర్ మండలం జానకిపురం ఎన్కౌంటర్లో విధి నిర్వహణలో



భాగంగా ప్రాణాలు అర్పించి వీర మరణం పొందిన ఘటన ప్రాంతాన్ని కలచి వేసింది. నిన్నటి రోజుకు 11 ఏండ్లు పూర్తికాగా వారి యొక్క జ్ఞాపకాలను వారి త్యాగాన్ని స్మరించుకుంటూ స్థానిక పోలీస్ స్టేషన్ లో వారి చిత్రపటాలకు ఎస్సై లక్ష్మీనారాయణ అదేవిధంగా సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు.. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ మల్లేష్, విజయ్, హేమలత, ప్రియాంక పాల్గొని వీరుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## దేశ ఐక్యతను బలపరిచే ముఖ్య కార్యక్రమం ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్

### ప్రధానోపాధ్యాయురాలు ఎం.సువర్ణ

గరిడేపల్లి, ఏప్రిల్ 04(ప్రజా జ్యోతి): దేశ ఐక్యతను బలపరిచే ముఖ్య కార్యక్రమం ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.సువర్ణ అన్నారు.శనివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఏక్



భారత్ – శ్రేష్ఠ భారత్ కార్యక్రమం లో హర్యానా రాష్ట్ర భాష,వారి రాష్ట్ర చిహ్నాలు,సంస్కృతి ల గురించి విద్యార్థులకు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశం అనేది భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని,వివిధ భాషలు, సంస్కృతులు,సంప్రదాయాలు ఉన్నప్పటికీ మనందరం ఒకే దేశానికి చెందినవాళ్లమని ఈ భావనను మరింత బలపరచడానికి ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ కార్యక్రమం ముఖ్య పాత్ర పోషిస్తోందని అన్నారు.హర్యానా సంస్కృతిక,సంప్రదాయాలతో అలరించిన విద్యార్థులకు బహుమతులు అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు డబ్బాతో రైతుల ఆందోళన

### పంటను ట్రాక్టర్‌తో నాశనం చేశారంటూ ఆవేదన

### నిందితులపై తక్షణ చర్యలు కోరుతూ నిరసన

కోదాడ టౌన్, ఏప్రిల్ 04 (ప్రజా జ్యోతి): కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం గ్రామంలో రైతుల



ఆవేదన చెలరేగింది. గ్రామానికి చెందిన రైతులు మల్లు వెంకట్ రెడ్డి, మల్లు సైదిరెడ్డి, మల్లు యేసు రెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేపట్టడం కలకలం రేపింది. తమకు జీవనాధారమైన పంటను గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో ట్రాక్టర్‌తో తొక్కించి నాశనం చేశారని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతుల వివరాల ప్రకారం, గ్రామ శివారులోని మూడు ఎకరాల పొలంలో వారు ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే దశలో ఉండగా, అర్ధరాత్రి సమయంలో దుండగులు ట్రాక్టర్‌తో పొలంలోకి దూసుకెళ్లి పంటను పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ దాడి వెనుక బిక్షమా రెడ్డి అనే వ్యక్తి ఉన్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ఉద్దేశపూర్వకంగా ఈ ఘటనకు పాల్పడ్డాడని వారు పేర్కొన్నారు. “మా చెమటోడ్చి పండించిన పంటను ఇలా నాశనం చేయడం మా జీవితాలపై దాడి చేసినట్లే” అని బాధిత రైతులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని, పంటను ధ్వంసం చేసిన వ్యక్తిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు పురుగుల మందు డబ్బాతో నిరసనకు దిగారు. పరిస్థితి విషమించకుండా అధికారులు వెంటనే స్పందించాలని వారు కోరుతున్నారు.ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, రైతుల ఆందోళనతో ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు సమాచారం.

## కోదాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

### న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

కోదాడ టౌన్, ఏప్రిల్ 04 (ప్రజా జ్యోతి): కోదాడ బార్ అసోసియేషన్ కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గం చే శనివారం కోర్టు ఆవరణలో ఎన్నికల అధికారి పాలేటి నాగేశ్వరరావు, సహాయ అధికారి మాధవరపు రామకృష్ణ లు ప్రమాణ స్వీకారం చేయించారు. అ ధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు,ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ,సంయుక్త కార్యదర్శి షేక్ జాని పాషా, లైబ్రరీ సెక్రటరీ గాలి శ్రీనివాస నాయుడు,కోశాధికారి కోదూరు వెంకటేశ్వరరావు,క్రీడలు & సాంస్కృతిక కార్యదర్శి వెంకటాచలం,మహిళా ప్రతినిధి వి. ధనలక్ష్మి ,ఈసీ సభ్యులు షేక్ రంజాన్ బాషా, టి. సీతారామరాజు, బి. దుర్గ, పి. హేమలత, షేక్ నాగుల్ పాషా, పి. హనుమంతరావు, బి. శ్రీనివాసరావు, సి.హెచ్. పెద్దబ్బాయ్ లను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిలివేరు వెంకటేశ్వర్లు పలువురు న్యాయవాదులు శాలువా పూల బొకేలతో అభినందించి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. నూతన కోర్టు భవనం త్వరితగతిన పూర్తయ్యే విధంగా కృషి చేయడంతో పాటు న్యాయవాదుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.



## స్టేడియంలో వడ్లు పొయ్యొద్దంటూ తహశీల్దార్ కి వినతి

తుంగతుర్తి, ఏప్రిల్ 4,(ప్రజా జ్యోతి): మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో వడ్లు పొయ్యొద్దంటూ క్రీడాకారులు, యువకులు శనివారం తహశీల్దార్ దయానందంకు వినతిపత్రం



అందించారు. మినీ స్టేడియంలో వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో మార్నింగ్ వాకర్స్, ఈవినింగ్ వాకర్స్ లకు ఇబ్బందికరంగా ఉందని వారు తెలిపారు. ప్రతిసారి మినీ స్టేడియంలో వడ్ల కొనుగోలు కేంద్రం నిర్వాహకులు నిర్లక్ష్యంగా గ్రౌండ్లో మొత్తం ఇసుకరాళ్లు, చెత్తాచెదారంతో వదిలేసి వెళ్ళిపోతున్నారని దీంతో క్రీడలకు ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో మడూరి రమేష్, ఉప్పుల రాంబాబు, ఎల్లబోయిన శ్రీకాంత్, భాష, జవాజి నాగరాజు, ఆంజనేయులు, తాడూరి సైదులు తదితరులున్నారు.

# గాలి కుంటు నివారణ టీకాలు



**కమ్మర్‌పల్లి ఏప్రిల్ 4,ప్రజా జ్యోతి.** కమ్మర్ పల్లి మండలంలోని ఉప్పులూరు గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ శైలందర్ ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో 22 గోజాతి 117 గేదెజాతి పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ రావు మాట్లాడుతూ ప్రతి పశువుకు తప్పకుండా టీకా వేయించుకోవాలని అలాగే ప్రతి ఆరు నెలలకు ఒకసారి గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని సూచించారు. జీవాలు గాలికుంటు వ్యాధి బారిన పడడం వల్ల నోటిలో పుల్లతో చొంగ కారడం, కాలి డెక్కలలో పగుళ్లు ఏర్పడి నడవలేకపోవడం ,పాల ఉత్పత్తి తగ్గిపోవడం ,చూడి పశువులు అబార్షన్లు అవడం ,వంటి లక్షణాలు ఏర్పడతాయి .కావున రైతులు ముందు జాగ్రత్త కొరకు తప్పకుండా గాలికుంటు నివారణ టీకాలు చేయించుకోవాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో రైతులు మరియు పశు వైద్య సిబ్బంది , ప్రవీణ్ రెడ్డి, పాల్గొన్నారు.

# అదృశ్యమైన కాత్రాజి రాజశేఖర్ మృతదేహం లభ్యం



**ధర్పల్లి: ఏప్రిల్/ 4 ( ప్రజా జ్యోతి)** దర్పల్లి మండలం రేకుల పల్లి గ్రామంలో ఇటీవల రాజశేఖర్31వ తేదీన కనిపించుట లేదని కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నా పోలీసులకు గత నెల31న అదృశశీ మైన రాజశేఖర్ ఈ రోజు శవం మై పడి ఉన్నాడని గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ధర్పల్లి సిఐ బిక్షపతి, సిరికొండ ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్నికి పోలీసులు వెళ్ళగా శవమై కనిపించిన రాజశేఖర్ పోలీసులు డెడ్ బాడీ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఏది ఏమైనా గ్రామంలో విషాదశాలు నెలకొంది.

### వరి కొనుగోలు కంట్రోల్ రూమ్‌ను
# ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్






**కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 04. (ప్రజాజ్యోతి)** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు జిల్లా పరిపాలన కీలక చర్యలు చేపడుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం సివిల్ సప్లయ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ 08468-220051 అనే కంట్రోల్ రూమ్ నంబర్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచుతూ, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రైతులు తమకు ఎదురయ్యే సమస్యలు, సందేహాలు, కొనుగోలు సంబంధిత వివరాల కోసం ఈ నంబర్‌ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. వరి కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత, వేగం, సమర్థతను పెంచేందుకు ఈ కంట్రోల్ రూమ్ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్, డిసిఓ రామ్మోహన్, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### మానవత్వానికి ప్రతిరూపంగా
# నిలిచిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 04. (ప్రజాజ్యోతి)** మరోసారి తమ సేవా భావాన్ని చాటుకున్నారు.తేది 31-03-2026 న రోడ్డు పై నిరాశ్రయంగా తిరుగుతున్న ఒక గుర్తు తెలియని మానసిక అస్వస్థత గల వ్యక్తిని స్వయంగా గుర్తించిన జిల్లా కలెక్టర్ అతనికి తక్షణమే సహాయం అందించాలని జిల్లా సంక్షేమ అధికారి ని ఆదేశించారు. కలెక్టర్ మానవతా దృక్పథంతో ప్రారంభమైన ఈ చర్య ఒక కుటుంబానికి తిరిగి ఆనందాన్ని తీసుకొచ్చింది.జిల్లా సంక్షేమ అధికారి పర్యవేక్షణలో ప్రభుత్వ వృద్ధాశ్రమ సిబ్బంది ఆ వ్యక్తిని సంరక్షణలోకి తీసుకుని, అతనికి ఆహారం, శుభ్రత, వైద్య సేవలు అందించారు.జగిత్యాల జిల్లా వాసి అయిన అతనికి సేవలు అందిస్తూ, వైద్య పరీక్షలు చేయించి, శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించి, కొత్త జీవితం ఇచ్చారు. అతని ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడానికి అవసరమైన చికిత్స అందించారు.ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా, వారు 04-04-2026 న శనివారం కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ ను బంధువులు కలసి 25 సంవత్సరాల తరువాత తమ కుటుంబ సభ్యుని తిరిగి పొందిన ఆనందంలో, జిల్లా కలెక్టర్ మానవత్వాన్ని కొనియాడుతూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సంఘటన ద్వారా జిల్లా కలెక్టర్ మానవత్వం, సేవా భావం, బాధ్యతాయుత పరిపాలనకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.

### రేషన్ బియ్యం కోసం
# గంటల తరబడి వెయిటింగ్




**బిచ్కుంద ప్రతినిధి. ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి)** ప్రభుత్వం లబ్ధిదారులకు ఒకేసారి మూడు నెలల బియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వం లబ్ధిదారులకు ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఏప్రిల్, మే, జూన్ బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. లబ్ధిదారులు స్థానిక చౌక ధరల దుకాణాలలో సన్న బియ్యాన్ని ఒకేసారి పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తుండటంతో ఒక్కొక్కరి వేలి ముద్రలు మూడు సార్లు తీసుకోవాల్సి వస్తుంది. మూడుసారు. తూకం వేయాల్సిందిగా ప్రభుత్వం డీలర్లకు సూచించింది. దీంతో ఒక్కొక్కరికి 10 నిమిషాలకు పైగానే సమయం పడుతుంది. ఈ బియ్యాన్ని తీసుకెళ్లేందుకు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు డీలర్లు సరఫరా చేస్తున్నప్పటికీ జనాల రద్దీ తగ్గడం లేదు. కామారెడ్డి జిల్లాతో పాటు కొన్ని గ్రామాల లబ్ధిదారులు ఎండలో నిలుచోలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లబ్ధిదారులు కాస్త ఓపికగా ఉంటే సజావుగా బియ్యం పొందే వీలుంటుంది. ఈ (ఏప్రిల్) నెల మొత్తం సరఫరా చేయనున్నట్లు డీలర్లు పేర్కొంటున్నారు. తడి హిప్పర్గ గ్రామంలోనీ చౌక ధరల దుకాణం దృశ్యాన్ని 'దిశ' క్లిక్ మనిపించింది.

### న్యూ బస్ స్టాండ్‌లో
# హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు
- సెల్ ఫోన్, నగదు కోసం దాడి
- నిందితుడి నుండి ఫోన్ స్వాధీనం
- కేసును ఛేదించిన కామారెడ్డి పోలీస్ అధికారులను అభినందించిన జిల్లా ఎస్పీ




**కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 04. (ప్రజాజ్యోతి)** కామారెడ్డి ఏఎస్పి బి చైతన్య రెడ్డి కామారెడ్డి పట్టణంలోని న్యూ బస్ స్టాండ్‌లో గత ఫిబ్రవరిలో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. కేవలం మొబైల్ ఫోన్, నగదు కోసం తోటి కూలీని అత్యంత కిరాతకంగా హతమార్చిన నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు కామారెడ్డి ఏఎస్పి బి. చైతన్య రెడ్డి, వివరాలను వెల్లడించారు. గత ఫిబ్రవరి 12వ తేదీ రాత్రి సుమారు 8:55 గంటల సమయంలో, కామారెడ్డి బస్ స్టాండ్ ఎంక్వయిరీ కౌంటర్ వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య మొబైల్ ఫోన్ విషయమై ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో నిందితుడు బాధితుడైన శ్రీనివాస్ (కూలీ) పై ముఖం మరియు ఛాతిపై విచక్షణారహితంగా దాడి చేసి, కిందపడేసి చంపాడు. అనంతరం బాధితుడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్ మరియు రూ. 300 నగదును దోచుకుని అక్కడి నుండి పరారయ్యాడు. ఇట్టి విషయం పై బస్ స్టాండ్ కంట్రోలర్ షెర్ల సత్య గౌడ్ ఫిర్యాదు మేరకు కామారెడ్డి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించడం జరిగినది.

**ఘటన వివరాల్లోకి వెళ్తే:**
గత ఫిబ్రవరి 12వ తేదీ రాత్రి సుమారు 8:55 గంటల సమయంలో, బస్టాండ్ ఎంక్వయిరీ కౌంటర్ వద్ద నిందితుడు ఆకాష్ నాగురావ్ కోవె, మరో కూలీ అయిన శ్రీనివాస్‌తో మొబైల్ ఫోన్ విషయమై గొడవకు దిగాడు. ఈ క్రమంలో నిందితుడు శ్రీనివాస్‌పై ముఖం మరియు ఛాతిపై తీవ్రంగా దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం బాధితుడి వద్ద ఉన్న ఒప్పో మొబైల్ ఫోన్ మరియు రూ. 300 నగదును దోచుకుని నిందితుడు పరారయ్యాడు. బస్టాండ్ కంట్రోలర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తులో భాగంగా నిందితుడు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో తలదాచుకున్నట్లు గుర్తించారు. ఆదివారం కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు నిందితుడిని పట్టుకుని విచారించగా, అతను తన నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుండి చోరీకి గురైన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, అతడిని రిమాండ్‌కు తరలించారు.

**నిందుతుని వివరాలు:**
ఆకాష్ నాగురావ్ కోవె (తండ్రి) నాగురావ్ కోవె, వయస్సు: 28 సం, పంగిడి గ్రామం, అర్ని తలోక్ యవత్మాల్ జిల్లా మహారాష్ట్ర రాష్ట్రం. రికవరీ సొత్తు: నిందితుడి వద్ద నుండి మరణించిన వ్యక్తికి సంబదించిన ఒక ఒప్పో కంపెనీ సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొనైనది. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించిన కామారెడ్డి పట్టణ ఇన్స్పెక్టర్ బి. నరహరి, ఏఎస్ఐ రంగా రావు, కానిస్టేబుళ్లు కమలాకర్, రాజు, సంపత్ లను జిల్లా ఎస్పీ మరియు ఏఎస్పి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే, నిందితుడి ఆచూకీకి సంబంధించిన సమాచారం అందించిన షేక్ సద్దాంను ఎస్పీ అభినందించి ప్రశంసించారు.

# వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

- పాల్గొన్న సర్పంచ్ ఎడ్ల వీనిల - రైతులకు పెద్ద ఊరట

**కామారెడ్డి రూరల్ 4 ఏప్రిల్ ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం రాఘవపూర్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల ఘనంగా ప్రారంభించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా గ్రామంలోని రైతులు తమ పంటను సులభంగా విక్రయించుకునే అవకాశం లభించిందని సర్పంచ్ తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించడం, మధ్యవర్తుల సమస్యలను తొలగించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రం ద్వారా రైతులు నేరుగా ప్రభుత్వానికి ధాన్యం అమ్ముకునే అవకాశం లభించడం వల్ల వారికి ఆర్థికంగా ఎంతో లాభం చేకూరుతుందని ఆయన వివరించారు.కార్యక్రమంలో ఏటీఎం శ్రీనివాస్ సిసి శ్రీనివాస్ ఉప సర్పంచ్ నరేష్ మంద స్వామి కిషన్ మోర్చా ప్రెసిడెంట్ భూక్య రవి మహిళా సంఘం అధ్యక్షులు మంద లక్ష్మి మంద రేణుక దోకూరి రుక్మిణి వివో ఏ లావణ్య క్యాసం పల్లి తండా సర్పంచ్ భూక్య శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని కేంద్రాన్ని సందర్శించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాభివృద్ధిలో రైతుల పాత్ర ఎంతో ముఖ్యమని, రైతులు బలంగా ఉంటే గ్రామం కూడా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు, సీఎలు, గ్రామ పెద్దలు, రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అధికారులు రైతులకు కొనుగోలు ప్రక్రియ, నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం కావడంతో గ్రామ రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇకపై తమ పంటను ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయించుకునే అవకాశం లభించిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.రైతులకు మేలు చేసే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



### కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో
# మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్





**కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 04. (ప్రజాజ్యోతి)** ఆర్కే విద్యాసంస్థ స్థాపించి 25 సంవత్సరాలు గడుచిన సందర్భంగా లక్ష్మీదేవి గార్డెన్స్ లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ దేశానికి రైతు ఎంత ముఖ్యమో యువత కూడా అంతే ముఖ్యమని యువత చెడు వ్యసనాలకు వేళ్ళకుండా సామాజిక స్పృహతో ఉంటూ, చదువుని జీవితాన్ని సరియైన మార్గంలో ముందుకు తీసుకెళ్లి తల్లితండ్రులతో పాటు గురువులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కాసర్ల గోదావారి స్వామీ,స్థానిక కౌన్సిలర్ నరేందర్ రెడ్డి, ఆర్కే విద్యాసంస్థల సిఈఓ జైపాల్ రెడ్డి,చైర్మన్ బాస్కర్ రావ్ కళాశాల అధ్యపక బృందం,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన!

- కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం
- 10 లక్షల రూపాయల నిధులు మంజూరు - భూమి పూజ చేసిన సర్పంచ్



**సదాశివనగర్, ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ మండలం వజ్జపల్లి గ్రామంలో మహిళా సమైక్య భవనానికి శనివారం గ్రామ సర్పంచ్ రాధా బాయ్-శ్యామ్ రావు. శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ సర్పంచ్ రాధా బాయ్ మాట్లాడుతూ మహిళా సమైక్య భవనం గురించి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు. దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుండి 10 లక్షలు రూపాయలు మహిళా సమైక్య భవనం కు నిధులు మంజూరు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వము కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు మహిళా సంఘాల సభ్యులు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. ఏపీఎం ప్రసాద్ మాట్లాడుతూ మహిళా సమైక్య భవనం మంజూరు చేసినందుకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు. కు మహిళా సంఘాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి అభివృద్ధి చెందాలని కోరారు. సీసీ భూమయ్య మాట్లాడుతూ మహిళా సంక్షేమం కొరకు రాష్ట్ర ప్రభుత్వము ఎంతో కృషి చేస్తుంది అన్నారు. గ్రామ సంఘం నుండి రుణాలు తీసుకొని వ్యాపార అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నరసింహులు. పాలకవర్గం సభ్యులు గ్రామ సంఘం అధ్యక్షురాలు లక్ష్మీ భాయి మహిళా సంఘాల సభ్యులు వివో రజిని. గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- దళారులకు అమ్మి మోసపోవద్దు: సర్పంచ్ సంధ్య బాలరాజ్

**రాజంపేట ఏప్రిల్ 04 (ప్రజా జ్యోతి)** రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని శివాయిపల్లి గ్రామ సర్పంచ్ బిక్కి సంధ్య బాలరాజ్ సూచించారు. శనివారం శివాయిపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం క్రమపద్ధతిలో ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తామని తెలిపారు. రైతులు ఎటువంటి అనుమానాలు లేకుండా ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజారెడ్డి, ఉప సర్పంచ్ సాయిరెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, దుర్గాదాస్, లత, మహిళా సమాఖ్య సభ్యులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



# నాగపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ళ పరిశీలన







**కమ్మర్‌పల్లి ఏప్రిల్ 4,ప్రజా జ్యోతి.** కమ్మర్ పల్లి మండలం నాగపూర్ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్లను ఎంపీడీఓ రాజ శ్రీనివాస్ శనివారం రోజున పరిశీలించారు.గ్రౌండ్ కానివి, గ్రౌండ్ తర్వాత ప్రగతిలో లేనివి, వివిధ దశలలో ఉన్న మొత్తం లబ్ధిదారుల ఇంటింటికి సర్పంచ్ కప్పదండీ అశోక్,పంచాయతీ కార్యదర్శి, కె. సంధ్య,ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ సిబ్బంది వెళ్లి అందరితో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన 20 వ తేదీ లోగా ప్రగతికి తేవలసినదిగా ప్రతి ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారును కోరారు.

### చల్లగార్గలో అంగన్వాడి
# కేంద్రాలను పరిశీలించిన ఎంపీ ఓ రాజేష్

**ధర్పల్లి: ఏప్రిల్/ 4 ( ప్రజా జ్యోతి)** అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ధర్పల్లి ఎంపీ ఓ రాజేష్ అంగన్వాడి టీచర్లకు మిరు పిల్లలకు సరియైన పౌష్టికాహారం సరైన పద్ధతిలో అందించాలని పనిలో నిర్లక్ష్యం చేయకూడదని ఆయన అన్నారు. అంగన్వాడీలో పిల్లలకు అందించి తగ్గట్టుగా ఎదుగుతున్నారా లేదా అని ఎత్తు మరియు బరువు చూసుకోవాలని రిజిస్టర్ మైంటైన్ చేయాలని, రోజు విడిచి రోజు గుడ్డు బాలామృతం కూడా అందించాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాదె నరేష్ అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

# మహిళలకు ఉద్యోగాల్లో విస్తృత అవకాశాలు

– జిల్లా జడ్జి సాయి రమాదేవి



**సిద్ధిపేట అర్బన్, ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి):** ప్రస్తుత కాలంలో పలు రంగాలలో ఉద్యోగ అవకాశాలు విస్తరించాయని, ముఖ్యంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలుతో మరిన్ని అవకాశాలు లభిస్తున్నాయని జిల్లా జడ్జి సాయి రమాదేవి తెలిపారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విరాళంగా అందించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ ప్లాంట్‌ను మద్దుల సోమేశ్వర్ రెడ్డి, వారి తనయులు రాజీవ్ రెడ్డి, గాల్ రెడ్డిలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. జి. జీవన్ కుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ, న్యాయస్థానాల్లో కూడా మహిళలకు అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలంటే ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ, జిల్లా జడ్జి హాజరుకావడం విద్యార్థులకు ప్రేరణనిచ్చిందని తెలిపారు. అలాగే ఆర్వో ప్లాంట్‌ను విరాళంగా అందించిన మద్దుల సోమేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవన్ రెడ్డి, దేవనూరు రవీందర్, కనకయ్య, కరుణశ్రీ, వైస్ ప్రిన్సిపల్ డా. శ్వేత, డా. స్రవంతి, డా. సువర్ణ దేవి, కిషోర్, డా. స్వప్న, హరిప్రసాద్ తదితరులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలను
# పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు





**నంగునూరు ఏప్రిల్ 4( ప్రజా జ్యోతి):-** మండల కేంద్రమైన నంగునూరులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ వార్డు సభ్యులు పోలబోయిన రాములు, పేర్మని మల్లయ్య, సీనియర్ నాయకులు కోల సతీష్ గౌడ్ తండ్రి సాయిలు, వార్డు సభ్యులు అరె స్వప్న శ్రీనివాస్ తల్లి విజయ, వానరాశి చంద్రమౌళి అన్న సోనీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాలను అలాగే మండల పరిధిలోని నర్మెట గ్రామంలోని మాజీ ఎంపిటిసి సీనియర్ రిపోర్టర్ కూతుర్ రాజిరెడ్డి తల్లి శనివారం నాడు మరణించడంతో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పూలమాలవేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. వీరితోపాటు మండల నాయకులు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి మాజీ ఏఎంసీ చైర్మన్ ఎడ్ల సోమి రెడ్డి టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లింగం గౌడ్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్పీఓను సందర్శించిన అధికారులు




**చిన్నకోడూరు ఏప్రిల్04(ప్రజా జ్యోతి):-** మండలంలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఫీూ) కార్యకలాపాలను సంబంధిత అధికారులు పరిశీలించారు. సంస్థ ద్వారా రైతులకు అందుతున్న సేవలు, అమలు చేస్తున్న కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ రిజిస్ట్రార్ సురేఖ రాణి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆనందరావు మాట్లాడుతూరైతులు సంఘటితంగా ముందుకు వస్తేనే వ్యవసాయ రంగంలో ఆర్థిక బలపడుతుందని పేర్కొన్నారు. ఎఫ్పీఓల ద్వారా రైతులు తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు పొందడమే కాకుండా పెట్టుబడి ని తగ్గించుకునే అవకాశాలు కూడా ఉంటాయన్నారు. చిన్నకోడూరు ఎఫ్పీఓ రైతుల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తోందని రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పంట రోగ నిర్ధారణతో మార్కెటింగ్ సౌకర్యాలు అందించే దిశగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ డైరెక్టర్ వెంకటరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సిద్దిపేట డిసిఓ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ ఏలేటి వెంకటరెడ్డి, సీఈవో మట్ట మల్లారెడ్డి, అకౌంటెంట్ కృష్ణ తదితరులున్నారు.

### బాధితులకు
# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



**మిరుదొడ్డి, ఏప్రిల్ 4, (ప్రజా జ్యోతి) :** దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేయడం జరిగిందని చెప్యాల సర్పంచ్ కమటం అంకిత నరేష్ అన్నారు. శనివారం మిరుదొడ్డి మండల పరిధిలోని చెప్యాల గ్రామంలో బాధితులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అందించే సీఎంఆర్ఎఫ్ సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన బాధితులకు ఈ ఆర్థిక సహాయం అందించేందుకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఎల్లప్పుడూ ముందుండి సహకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాబు, స్వామి, కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఈవీఎం గోదాం
# పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్( ప్రజాజ్యోతి ) ఏప్రిల్ 04 :** జిల్లాలో నిర్వహిస్తున్న నెలవారీ తనిఖీల కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎం (ఈవీఎం ) గోదాంను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరచిన ఈవీఎంల భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, అగ్ని ప్రమాద నివారణ చర్యలు, డబుల్ లాక్ సిస్టమ్ వంటి అంశాలను కలెక్టర్ సవివరంగా పరిశీలించారు. గోదాం వద్ద నియమించిన భద్రతా సిబ్బంది విధుల నిర్వహణపై కూడా సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడటానికి ఈవీఎంల భద్రత అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. గోదాంలో అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు గోదాంలో అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సంబంధిత విభాగాల అధికారులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి దయతో అందరూ బాగుండాలి

– గట్లమల్యాలలో పెద్దమ్మ తల్లి వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు











**నంగునూర్,ఏప్రిల్ 4 (ప్రజా జ్యోతి):-** పెద్దమ్మ తల్లి దయతో అందరూ బాగుండి సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో గ్రామస్తులందరూ బాగుండాలని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. శనివారం నాడు మండల పరిధిలోని నిర్వహిస్తున్న పెద్దమ్మతల్లి వార్షికోత్సవంలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గట్లమల్యాల అభివృద్ధికి నా వంతు కృషి చేశానాని అమ్మవారి దయతో మళ్లీ మంచి రోజులొస్తాయిగట్లమల్యాలతో పాటు వాగు అవతల గ్రామాలకు విద్య, వైద్యం, సాగునీరు అందించాం. కరోనా కష్టకాలంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇస్తే, నేడు మూడు సీజన్లుగా రైతుబంధు రాని పరిస్థితి. గట్లమల్యాల అభివృద్ధికి ఎప్పటికీ నా వంతు సహకారం అందిస్తా అన్నారు గట్లమల్యాల గ్రామంలో మీ అందరితో కలిసి పెద్దమ్మ తల్లి వార్షికోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. అమ్మవారి ఆశీస్సులతో కేసీఆర్ సహకారంతో ఈ గ్రామాన్ని గతంలో దినదినాభివృద్ధి చేశానాని .వాగు అవతల ఉన్న ఈ గ్రామాలు అభివృద్ధిలో వెనుకబడ్డాయని, వాటిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఎవరూ అడగకముందే ఇక్కడ కోటి 60 లక్షల రూపాయలతో పీహెచ్‌సీ భవనాన్ని మంజూరు చేయించాను. అన్నారు ముగ్గురు డాక్టర్లు, స్టాఫ్ నర్సులను నియమించి రాత్రింబవళ్లు గట్లమల్యాల ప్రజలకు వైద్యం అందేలా చేశాం. నేను మార్కెటింగ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాంత రైతుల కోసం ప్రత్యేకంగా సబ్ మార్కెట్ యార్డ్ తీసుకువచ్చాను. ఇక్కడే షెడ్లు నిర్మించి, వడ్లు, మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల కష్టాలు తీర్చాఅన్నారు వాగు అవతల గ్రామాలకు సాగునీరు రావాలని ఒక లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని కూడా మంజూరు చేశాం. ఆ లిఫ్ట్ పనులు పూర్తయి ట్రయల్ రన్ కూడా సక్సెస్ ఫుల్ గా జరిగింది. ఈ ప్రాంత విద్యార్థుల కోసం అక్కన్నపల్లి లో మోడల్ స్కూల్ తెచ్చుకున్నామన్నారు ప్రత్యేకంగా గట్లమల్యాల గ్రామంలో ఎస్సీ బాలికల హాస్టల్ ను మంజూరు చేశాం. డబుల్ రోడ్లు వేయించడంతో పాటు, గ్రామంలోని అన్ని కులాలకు కమ్యూనిటీ హాళ్లు, దేవాలయాల నిర్మాణానికి ప్రభుత్వం తరఫున మరియు నా వ్యక్తిగత హోదాలోనూ పూర్తి సహకారం అందించాను. గట్లమల్యాల ప్రజలు నాపై ఎంతో ప్రేమ, అభిమానం చూపిస్తున్నారు,అన్నారు భవిష్యత్తులోనూ గ్రామ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాఅన్నారు .కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరోనా కష్టకాలంలో కూడా రైతుబంధు ఎంత మంచిగా పడిందో మీకు తెలుసు. కానీ నేడు ప్రభుత్వం ఒక పంటకు ఇస్తే, మూడు పంటలకు ఎగ్గొట్టే పరిస్థితి వచ్చింది. రైతుబంధు సరిగ్గా రావడం లేదు. గతంలో లాగా 24 గంటల కరెంట్ రావడం లేదు. సాయంత్రం కరెంట్ పోతే మళ్లీ ఉదయం 4 గంటలకు వస్తున్న పరిస్థితిని రైతులు చూస్తున్నారు. ఏది ఏమైనా ఆ పెద్దమ్మ తల్లి దయ, ఆశీర్వాదం మనందరి పైన ఉంటుంది. అమ్మవారి దయతో మళ్లీ మంచి రోజులు వస్తాయి గట్లమల్యాల గ్రామానికి, సిద్దిపేటకు, మన తెలంగాణ రాష్ట్రానికి అంతా మంచే జరగాలని మనసారా ప్రార్థిస్తున్నాను. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి మాజీ ఏఎంసీ చైర్మన్ ఎడ్ల సోమి రెడ్డి టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు లింగం గౌడ్ కోల రమేష్ గౌడ్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంకు ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

– తొగుట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి – కేసీఆర్ క్యాంపు కార్యాలయం పై దాడి పిరికిపంద చర్య

**తొగుట, ఏప్రిల్ 05 (ప్రజాజ్యోతి):** ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఖూనీ చేస్తుందని తొగుట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఘాటుగా విమర్శించారు. గజ్వేల్ లో జరిగిన సంఘటన పై శనివారం జీడిపల్లి రాంరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కె హరికృష్ణారెడ్డితో కలిసి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ, రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని పూర్తిగా గూండాల రాజ్యంగా మార్చేశారన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేత క్యాంపు కార్యాలయంపైనే దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్లా, లేనట్లా అని ప్రశ్నించారు.



పోలీసులు చట్టాన్ని కాపాడాల్సింది పోయి కాంగ్రెస్‌కు ప్రైవేట్ సైన్యంలా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. దాడులకు పాల్పడుతున్న మూకలను పోలీసులు ఎందుకు అడ్డుకోవడం లేదని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల చిల్లర దాడులకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో సీఎం ఫోటో పెట్టాలని అనుకుంటే అధికారులు చర్య తీసుకోవాలని, కాంగ్రెస్ నాయకులకు ఎం అధికారం ఉందని ఆయన ప్రశ్నించారు. గ్రామ సభల్లో ఎమ్మెల్యే ఫోటోలు పెట్టడం లేదని, ప్రజాస్వామ్యం ను పాతర వేస్తున్నారని విమర్శించారు. క్యాంపు కార్యాలయం లో దాడి చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వారి వెంట నాయకులు వేల్పుల స్వామి, బందారు స్వామి గౌడ్, జహంగీర్, రాజు తదితరులున్నారు.

# గాలికి హస్తంలో కీలక బాధ్యతలు

– మెదక్ నర్సాపూర్ బిఎల్ఎగా నియామకం



**మెదక్ ప్రతినిధి (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 04 :** నర్సాపూర్, మెదక్ అసెంబ్లీ నియోజకవ ర్గాల బీఎల్ఏగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గాలి అనిల్ కుమార్ కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగిస్తూ నియామకం చేసింది. నర్సాపూర్, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గాల బూత్ లెవెల్ కోఆర్డినేటర్ గా గాలి అనిల్ కుమార్ ను నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా గాలి అనిల్ కుమార్ కు ఈ రెండు నియోజకవర్గాల్లో గట్టి పట్టుంది. మృదు స్వభావి, కార్యకర్తల కష్టాల్లో వెన్ను దన్నుగా ఉండే నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకు న్నారు. దీంతో కాంగ్రెస్ అధిష్టానం ఆయన సేవలను గుర్తించి ఈ మేరకు కీలక బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నియామకం పట్ల మెదక్, నర్సాపూర్ సెగ్మెంట్ ల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా



**చిన్నకోడూరు ఏప్రిల్ 04,(ప్రజా జ్యోతి):-** గ్రామాల అభివృద్ధి తమ ప్రభుత్వ లక్ష్యంగా పాలన సాగుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధి అల్లిపూర్ గ్రామంలో 10 లక్షల రూపాయలతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రి వివేక్ వెంకటస్వామి నియోజకవర్గ ఇంచార్జీ పూజల హరికృష్ణల సహకారంతో నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. పల్లెల దేశానికి పట్టుకోమాలని పల్లెలు బాగుంటేనే దేశం బాగుంటుందని అభివృద్ధి మంత్రంతో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో గ్రామాలన్ని అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంభాల మణెమ్మ, పంచాయతీ పాలకవర్గంతో పాటు తదితరులున్నారు

### చుక్కల్లో ఇసుక ధర..
# చక్రం తిప్పుతున్న 'చీకటి' దొర!

'అధికారుల 'సెలువు'.. అక్రమార్కులకు 'కొలువు'



**నర్సాపూర్ (ప్రజాజ్యోతి)** ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ.. నిఘా కళ్లకు గంతలు కడుతూ నర్సాపూర్ మండలంలో ఇసుక మాఫియా స్వైరవిహారం చేస్తోంది. జక్కపల్లి గ్రామం ఇసుక అక్రమ రవాణాకు ప్రధాన మార్గంగా మారుతుండగా, క్షేత్రస్థాయిలో యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కులు అధికారుల షెడ్యూల్‌ను పక్కాగా ఫాలో అవుతున్నారు. శనివారం తెల్లవారుజాము నుండే గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లను రోడ్లపైకి రానిస్తున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండే శనివారం ఒకటో రెండో ట్రిప్పులతో సరిపెట్టి, అసలు వేట ఆదివారం మొదలుపెడుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో అధికారుల పర్యవేక్షణ ఉండదన్న ధీమాతో శనివారం రాత్రి నుండే జక్కపల్లి పరిసరాల్లో ఇసుక తరలింపు జాతర సాగుతోంది.

**పంచాయతీ 'పర్యవేక్షణ' శూన్యం!**

గ్రామంలో ఇంత దందా సాగుతున్నా.. ట్రాక్టర్లు గ్రామం గుండా గీ పెడుతున్నా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ కనీసం స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల వత్తాసు వల్లే ఈ అక్రమ రవాణా సాఫీగా సాగుతోందని గ్రామస్థులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అదేపనిగా కృత్రిమ ఇసుక తయారీ సాగుస్తు, అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది.

**జిల్లా యంత్రాంగం దృష్టి సారించేనా?**

స్థానిక అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న తరుణంలో జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే రంగంలోకి దిగాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమ రవాణాకు సహకరిస్తున్న గ్రామ స్థాయి అధికారులపై ప్రజా ప్రతినిధుల పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సంక్రమణల నివారణపై అవగాహన



**సిద్ధిపేట రూరల్, ఏప్రిల్ 04 , (ప్రజాజ్యోతి) :**నోసోకోమియల్ ఇన్ఫెక్షన్లు ప్రధానంగా బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ వల్ల వ్యాపిస్తాయని డా. మురళీకృష్ణ తెలిపారు. ప్రపంచఆరోగ్య దినోత్సవం సందర్భంగా శశ్రుత హాస్పిటల్‌లో రోగులు, అటెండర్లు, సిబ్బందికి హాస్పిటల్‌లో కలిగే ఇన్ఫెక్షన్ల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతులను తరచూ శుభ్రంగా కడుక్కోవడం, మాస్క్ ధరించడం, రోగులను తాకే ముందు , తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడం, స్టెరైల్ డ్రెస్సింగ్ విధానాలను పాటించడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీకాంత్ , అరుణ్, మైక్రోబయాలజీ నిపుణులు మదన్ మోహన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్యాగ బాబు, స్వామి, అజయ్, సాయి నరేందర్ తదితర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే టీఆర్ఆర్ కుమార్తె వివాహానికి ఆహ్వానం



**పరిగి, ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి):** పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి (టీఆర్ఆర్) కుటుంబ సభ్యులతో కలిసి శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన కుమార్తె మేఘన రెడ్డి వివాహ వేడుకలో కుటుంబ సమేతంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను సీఎం కి అందజేశారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రిని ఆహ్వానించడం విశేషంగా నిలిచింది.

## క్షేత్రస్థాయిలో వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్





**కొడంగల్ ఏప్రిల్ 4 ప్రజా జ్యోతి :** శనివారం కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని కడ కార్యాలయంలో సమీక్ష సమావేశం అనంతరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ పనులను పరిశీలించిన కలెక్టర్ నూతన ఫర్నిచర్ సమకూర్చుకోవాలని అధికారులకు సూచించారు. పట్టణ కేంద్రంలో అంతర్గత మురుగు కాలువలను పరిశీలించిన కలెక్టర్ సెప్టిక్ ట్యాంక్ నిమిత్తం స్థలాన్ని పరిశీలించి ఎంపిక చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తదనంతరం పట్టణ కేంద్రంలో నిర్మాణం గావిస్తున్న స్విమ్మింగ్ పూల్, చెరువు సుందరీకరణ, డిగ్రీ కళాశాల, దుద్యాల మండలంలోని ఎడ్యుకేషన్ హబ్ లో చేపడుతున్న పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ తో పాటు కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, దుద్యాల్ తాసిల్దార్ కిషన్ నాయక్, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ గుప్తా, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఇంజనీర్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



**బషీరాబాద్ ఏప్రిల్ 4 ప్రజాజ్యోతి :** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బషీరాబాద్ మండలంలోని కాశీంపుర్ గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నరేష్ గౌడ్, రమేష్ రెండు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ శ్రీశైలం యాదవ్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్ తిరిగి అప్పగింత

### కానిస్టేబుల్ నర్సమ్మ



**బషీరాబాద్ ఏప్రిల్ 4 ప్రజాజ్యోతి :** బషీరాబాద్ మండలం బషీరాబాద్ గ్రామానికి చెందిన సుదర్శన్ మొబైల్ పోగొట్టుక పోవడం జరిగింది ఇట్టి విషయం బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వడంతో పోలీస్ సిబ్బంది సుదర్శన్ మొబైల్ సిఈఐఆర్ పోర్టల్ ద్వారా సర్చ్ చేసి వెతికి సుదర్శన్ ను ఆదివారం రోజు పిఎస్‌కు పిలిపించి ఫోను వారికి తిరిగి అప్పగించడం జరిగింది. ఫోన్ అందుకున్న సుదర్శన్ పోలీస్ సిబ్బందికి ఎస్ఐ కానిస్టేబుల్ నర్సమ్మకు అభినందనలు తెలిపారు.

## చందానగర్ నూతన పోస్టాఫీసు కార్యాలయం సందర్శించిన మిరియాల ప్రీతమ్



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి) :** చందానగర్‌లోని పోస్టాఫీసు ఈరోజు కొత్త ప్రాంగణానికి మారింది. ఇప్పటివరకు పాత లొకేషన్‌లో సేవలందించిన ఈ పోస్టాఫీసు, ప్రజలకు మరింత సౌకర్యంగా ఉండే విధంగా కొత్త ప్రదేశంలో ప్రారంభించబడింది. కొత్తగా ప్రారంభమైన ఈ పోస్టాఫీసు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రోడ్, సాయి దీప హాస్పిటల్ ఎదురుగా, హుడా కాలనీ, చందానగర్ వద్ద ఏర్పాటు చేయబడింది. ఈ ప్రదేశం ప్రజలకు సులభంగా చేరుకునే విధంగా ఉండటం విశేషం. ఈ సందర్భంగా పోస్టాఫీసు మేనేజర్ వెంకట్, కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త మిరియాల ప్రీతమ్ ని ఆహ్వానించారు. కొత్త కార్యాలయ ప్రారంభోత్సవంలో భాగంగా మిరియాల ప్రీతమ్ కొబ్బరికాయ కొట్టి శుభారంభం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ.... ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పోస్టాఫీసును సౌకర్యవంతమైన ప్రదేశానికి మార్చడం అభినందనీయమైన విషయం. ముఖ్యంగా సేవింగ్స్ పథకాలు, మనీ ట్రాన్స్ఫర్ వంటి సేవలు సాధారణ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ప్రభుత్వ సేవలు ప్రతి ఒక్కరికీ సులభంగా చేరేలా చేయడం మనందరి బాధ్యత అని తెలిపారు. కొత్త ప్రాంగణంలో పోస్టాఫీసు ప్రారంభం కావడంతో ప్రజలకు సేవలు మరింత సులభంగా అందనున్నాయి. పోస్టల్ సేవలతో పాటు సేవింగ్స్ స్కీమ్స్, మనీ ట్రాన్స్ఫర్, ఆధార్ సేవలు వంటి పథకాలు కూడా ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా గ్రామీణ, మధ్యతరగతి ప్రజలకు ఈ పథకాలు ఆర్థికంగా మేలు చేస్తాయి. చందానగర్ పోస్టాఫీసు కొత్త ప్రాంగణంలో ప్రారంభం కావడం స్థానికులకు ఒక శుభ పరిణామంగా భావించవచ్చు అని మిరియాల ప్రీతం అన్నారు.

# కాల్వల్లో అక్రమ మోటార్లు... రైతుల నీటి హక్కులు హరించబడుతున్నాయా?





**పరిగి, ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి) :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలోని అక్కమ్మ చెరువు కాల్వల్లో అక్రమంగా మోటార్లు, పైపులు ఏర్పాటు చేసి నీటిని మళ్లించడం వల్ల ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**5-10 వేల వసూళ్ల ఆరోపణలు... ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలి : హెచ్ఆర్పిఎస్ డిమాండ్**

ఒక్కో మోటార్‌కు ?5,000 నుండి ?10,000 వరకు వసూళ్లు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తుండగా, ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ (హెచ్ఆర్పిఎస్) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ షా మహమ్మద్ హుస్సైని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాల్వల్లో అక్రమ మోటార్ల కారణంగా నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ ఇప్పటికే అక్రమ మోటార్లపై జరిమానా, క్రిమినల్ కేసుల నిర్ణయం తీసుకున్నప్పటికీ, అమలు జరగడం లేదని ఆయన విమర్శించారు. గత నాలుగు సంవత్సరాలుగా అధికారులకు పలు ఫిర్యాదులు చేసినప్పటికీ, సమస్యకు స్థిర పరిష్కారం లభించలేదని అన్నారు. ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా కొన్ని మోటార్లు తొలగించినట్లు చేసి, తిరిగి వసూళ్లు చేసి వెళ్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారని హుస్సైని వెల్లడించారు. ఈ పరిస్థితులతో గ్రామంలో ఉద్రిక్తతలు, గొడవలు పెరుగుతున్నాయని తెలిపారు. అక్రమాలకు కొంతమంది రాజకీయ నాయకుల మద్దతు ఉన్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయని పేర్కొంటూ, వెంటనే అన్ని అక్రమ మోటార్లను తొలగించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతుల హక్కుల కోసం చట్టపరమైన పోరాటం చేపడతామని హెచ్చరించారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి





**కొడంగల్ ఏప్రిల్ 4 ప్రజా జ్యోతి :** మంజూరై పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. శనివారం కడా కార్యాలయంలో విద్యా మరియు సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, పబ్లిక్ హెల్త్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యుత్తు శాఖలు చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ దీపక్ తివారి కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ...వివిధ శాఖలకు సంబంధించి మంజూరై గ్రౌండింగ్ కానీ వివిధ అభివృద్ధి పనులను మొదలు పెట్టాలన్నారు. అత్యవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడి, బీటీ రోడ్లు, బ్రిడ్జ్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దుద్యాల్ మండల సము దాయ భవన పనులను మే నెలాఖరులోపు పూర్తి చేయాలని కలెక్టర్ అధికా రులను ఆదేశించారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ పనులు వేగంగా జరిగేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. సమీక్ష సమావేశంలో ఈడబ్ల్యూఐడిసి ఎస్ఇ విజయ భాస్కర్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ రాజ్ డిఇ సురేష్ కుమార్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, ట్రాన్స్కో ఎస్ఇ రవిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జయప్రకాష్ నగర్‌లో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి





**- జయప్రకాష్ నగర్ కాలనీ అధ్యక్షులు సముద్రాల సుధాకర్**

**అబ్దుల్లాపూర్ మెట్టు ఏప్రిల్ 04(ప్రజాజ్యోతి) :** ఎల్బీనగర్ నియోజకవర్గం కుంట్లూరు డివిజన్ పరిధిలోని జయప్రకాష్ నగర్ కాలనీలో శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయాన్ని నిర్మించాలనే తన చిరకాల కోరిక నేటికీ నెరవేరిందని జయ ప్రకాష్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సముద్రాల సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా తమ కాలనీలో ఆలయాన్ని నిర్మించాలని భావించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదన్నారు. ఎలాగైనా సరే ఆలయాన్ని నిర్మించాలని లక్ష్యంతో కాలనీలో ఉన్న 20 మంది సభ్యులను కలుసుకొని వ్యక్తికి పదివేల రూపాయల చొప్పున చందాలు వేసుకొని ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావించి తాను అనుకున్న స్థలంలో నిర్మాణ పనులకు ప్రారంభించామన్నారు. ఆలయ నిర్మాణ పనులకు మరికొంత డబ్బు అవసరమని భావించి తమకు సన్నిహితుడైన ఎస్.వి డెవలపర్స్ నిర్వాహకుడు సుర్వి సురేష్ ను కలుసుకొని ఆలయ నిర్మాణానికి సహకరించవలసిందిగా కోరడం జరిగిందన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి ఆలయ నిర్మాణానికి కావలసిన డబ్బులను మొత్తం తానే సమకూరుస్తానని ముందుకు వచ్చాడన్నారు, మీరు చందా రూపంలో సేకరించిన డబ్బులను తిరిగి వాపస్ తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. అందుకు తాము కూడా సమ్మతించడం జరిగిందన్నారు. కేవలం మూడు నెలల వ్యవధి లోపల తాను ఎక్కడ ఆలయాన్ని నిర్మించాలని భావించానో అక్కడే నిర్మాణం పూర్తి కావడం తనకు ఆత్మసంతృప్తినిచ్చిందన్నారు. శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి వారు తన ఆలయాన్ని సుర్వి సురేష్ చేతుల మీదుగా నిర్మింప చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. దైవకార్యానికి ముందుకు వచ్చి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసిన సుర్వి సురేష్ కు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులతోనే ఈ దైవకార్యం నెరవేరింది అన్నారు. ఆలయ నిర్మాణం ఎంత వేగంగా జరిగిందంటే అటువైపు ఉన్న కుంట్లూరు వాసులకు గాని, ఇటువైపు ఉన్న గృహకల్ప నివాసులకు గాని తెలియదన్నారు. గతంలోనూ కాలనీవాసులం అందరం కలిసి చందాలు పోగేసి ఒక దేవాలయాన్ని నిర్మించుకున్నామని ఆయన గుర్తు చేశారు. శ్రీ శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆశీస్సులు జయప్రకాష్ నగర్ కాలనీ వాసులందరిపై ఉండాలని, వారందరూ సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

## ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు లక్ష్మీనారాయణను సన్మానించిన అవొపా రాష్ట్ర అధ్యక్షుడు శంకర్



**కూకట్ పల్లి, ఏప్రిల్ 04 (ప్రజా జ్యోతి) :** ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా గెలుపొందిన అమరవాది లక్ష్మీనారాయణను శనివారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్, ఇతర కమిటీ సభ్యులు, నేతలతో కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తన గెలుపు కోసం పని చేసిన అవోపా రాష్ట్ర అధ్యక్షుడు, ఇతర సభ్యులు, ఇకముందు తాను చేయబోయే ఆర్యవైశ్యుల అభివృద్ధి లోను సహకరించాలన్నారు. అనంతరం అవోపా శంకర్ మాట్లాడుతూ తెలంగాణ లో అవోపా ఆర్యవైశ్య మహాసభ అనుభంద సంస్థలా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోల శ్రీధర్, జోనల్ చైర్మన్ అగిర్ అశోక్ కుమార్, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు మనోహర్రావు, ప్రధాన కార్యదర్శి దుబ్బ అనిల్ కుమార్, ఫైనాన్స్ సెక్రటరీ శివకుమార్, ఆర్గనైజేషన్ సెక్రెటరీ నాగేంద్రయ్య, రంగారెడ్డి జిల్లా అర్బన్ టు అధ్యక్షులు బొడ్డు శ్రీధర్, ఫైనాన్స్ సెక్రటరీ ఇడుకుల లింగయ్య, ఆర్కే పురం అధ్యక్షుడు గట్టు హరీష్, ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, శంకర్, పుప్పాలగూడ యూనిట్ అధ్యక్షుడు దారం వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## అతివేగంగా వెళ్లిన ద్విచక్ర వాహనదారుడు

**- అదుపుతప్పి దర్గాను ఢీకొని అక్కడికక్కడే తీవ్ర గాయాలతో ఒక వ్యక్తి మృతి**



**బాలానగర్, ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి) :** అతివేగం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ద్విచక్ర వాహనం అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న దర్గాను బలంగా ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన బాలానగర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గౌతమ్ నగర్ ప్రాంతానికి చెందిన అమితావ్ నాయక్ (35) శనివారం తెల్లవారుజామున తన ద్విచక్రవాహనం (TS08HC5245)పై ఇంటి నుండి కూకట్‌పల్లి వైపు బయలుదేరారు. బాలానగర్ మండల పరిధిలోని ర్యాడ్ క్లిఫ్ స్కూల్ సమీపానికి చేరుకోగానే, వాహనం ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయింది. అతివేగంతో ఉన్న బైక్ పక్కనే ఉన్న దర్గాను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమితావ్ నాయక్‌కు తల, శరీర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. దెబ్బల తీవ్రత ఎక్కువగా ఉండటం తో ఆయన ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు పంచనామా నిర్వహించిన అనంతరం, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం గాంధీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మితిమీరిన వేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమిక విచారణలో పోలీసులు తేల్చారు. రహదారిపై వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, వేగ నియంత్రణ పాటించా లని బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఈ సందర్భంగా వాహనదారులకు సూచించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తదుపరి దర్యాప్తు జరుపుతున్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న కొమిరిశెట్టి సాయి బాబా





**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం నల్లగండ్ల డివిజన్ గౌలిదొడ్డి గ్రామం కేశవనగర్ గ్రౌండ్ లో ఆర్ఎల్వై వస్తాద్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా. కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపు ను సందర్శించి మెడికల్ క్యాంపులో చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. అనంతరం నిర్వాహకులైన రాగం జంగయ్య యాదవ్, రాగం హరి శంకర్ యాదవ్‌ను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అంజమ్మ, దారుగుపల్లి నరేష్, రమేష్ గౌడ్, షామ్లెట్ శ్రీనివాస్, భిక్షపతి, పరమేష్, బాలకృష్ణ, వెంకట్రెడ్డి, నారాయణ, నవాజ్, బాలమణి, మాధవి, సురేష్ మరియు స్థానికులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డిప్యూటీ కమిషనర్‌కు వినతి

**- బిజెపి నాయకులు గుండె గణేష్ ముదిరాజ్**



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 04 (ప్రజాజ్యోతి):** మియాపూర్ సర్కిల్ కార్యాలయం హెచ్ఎంటి నుండి జెపి నగర్ వరకు మెయిన్ రోడ్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయవలసిందిగా డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకులు. మియాపూర్ సర్కిల్ పరిధిలోని హెచ్ఎంటి నుండి జెపి నగర్ వరకు ఉన్న ప్రధాన రహదారిలో వీధి దీపాలు తగిన విధంగా లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రయాణించే పాదచారులు వాహనదారులకు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చీకటి కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో పాటు భద్రతా సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. అందువల్లపై పేర్కొన్న రహదారిలో అవసరమైన ప్రదేశాల్లో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయించి, పనిచేయని దీపాలను తక్షణమే మరమ్మ తులు చేయించవలసిందిగా మనవి చేస్తున్నాము. అలాగే పెద్దవి (హైమాస్ట్) వీధి దీపాలను కూడా ఏర్పాటు చేయించ వలసిందిగా కోరుతున్నాము. ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఉమ్మడి మియాపూర్ డివిజన్ తరఫున ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడుగుండె గణేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులుజాజార శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు చరిత్రాత్మకం

**: ఎమ్మెల్యే శ్రీగణేష్**



**బోయిన్ పల్లి, ఏప్రిల్ 4 (ప్రజా జ్యోతి) :** తెలంగాణలో అడ్వకేట్స్ రక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు చరిత్రాత్మకమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. శనివారం పికెట్‌లోని తన కార్యాలయంలో తెలంగాణ లీగల్ సెల్ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, అసెంబ్లీలో అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అడ్వకేట్స్ భద్రత కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ బిల్లు న్యాయవాదులకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. అడ్వకేట్స్ ప్రొటెక్షన్‌తో పాటు జూనియర్ లాయర్లకు స్టైఫండ్, లా అకాడమీ ఏర్పాటు వంటి అంశాలు కూడా ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని తెలిపారు. ఈ బిల్లుతో అడ్వకేట్స్ పట్ల తమ ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లీగల్ సెల్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బాలు నాయక్, వైస్ ప్రెసిడెంట్ దివ్యశ్రీ, జనరల్ సెక్రటరీ లక్ష్మీకాంత్, కోఆర్డినేటర్ హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

కోరుట్ల మార్చి 03 ప్రజాజ్యోతి: జగిత్యాల జిల్లా కోరుట్ల మండల పరిధిలోని మోహన్‌రావుపేట శివారులో ఈరోజు రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడిక క్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.వివరాల్లోకి వెళ్తే... కోరుట్ల నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం, రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. రాత్రి వేళ కావడం, అలాగే రహదారిపై సరైన హెచ్చరిక సూచనలు లేకపోవడం ప్రమాదానికి కారణమై ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే అతన్ని జగిత్యాల ఏరియా



ఆసుపత్రికి తరలించారు.అయితే గాయపడిన వ్యక్తి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం అతనికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. మృతుడి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

స్థానికుల ఆవేదన:

ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా రాత్రి సమయంలో లైటింగ్ సదుపాయం లేకపోవడం, రోడ్డు మీద ఆగి ఉన్న వాహనాలకు హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# ఒడ్డెలింగాపూర్‌లో హెచ్ పీవి వ్యాక్సినేషన్ కార్యక్రమానికి శ్రీకారం

రాయికల్, ఏప్రిల్ 04 (ప్రజా జ్యోతి)

రాయికల్ మండలంలోని ఒడ్డెలింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణకు ఉపయోగపడే హెచ్‌పీవీ (హెచ్.పీ.వి)



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ కస్తూరి సతీష్ కుమార్ సమక్షంలో సర్పంచ్ నాగుల మానస సాయిరాజ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,14 నుంచి 15 సంవత్సరాల లోపు ఉన్న బాలికలు అందరూ ఈ వ్యాక్సిన్‌ను తీసుకొని గర్భాశయ ముఖ క్యాన్సర్ నుంచి రక్షణ పొందాలని కోరారు. ప్రారంభ దినాన నాలుగు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఇల్లేందుల శ్రీనివాస్, నర్సింగ్ అధికారులు మౌనిక, సుమలత, ఫార్మసీ ఆఫీసర్ దీపిక, ల్యాబ్ టెక్నీషియన్ రాజమణి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి , పంచాయతీ సెక్రటరీ సాయి, ప్రజా ప్రతినిధులు మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రీన్ బర్త్ డే ఛాలెంజ్‌కు సర్పంచ్ పిలుపు

## పుట్టినరోజుకు మొక్క నాటండి

కథలాపూర్, ఏప్రిల్ 4(ప్రజాజ్యోతి):

ఇప్పపల్లి పర్యావరణ పరిరక్షణకు సర్పంచ్ ముందడుగు వేస్తూ గ్రామ యువకులకు "గ్రీన్ బర్త్ డే ఛాలెంజ్"ను పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు తమ పుట్టినరోజు సందర్భంగా కనీసం ఒక మొక్క నాటి గ్రామాన్ని హరితంగా




మార్చాలని సర్పంచ్ సంభ నవీన్ యువతకు పిలుపునిచ్చారు. కేక్ కటింగ్‌కు బదులుగా మొక్కలు నాటడం ద్వారా ప్రకృతితో అనుబంధం పెంపొందుతుందని శనివారం ప్లెక్సీ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో ఆక్సిజన్ స్థాయిలు పెరిగి, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని యువకులు పేర్కొన్నారు. హరిత ఇప్పపల్లి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఈ గ్రీన్ బర్త్ డే ఛాలెంజ్‌లో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సర్పంచ్ నవీన్, గ్రామ యువత కోరుతున్నారు. కాగా సర్పంచ్ సంభ నవీన్ ఆలోచనలు కూడా విభిన్నంగా ఉన్నాయని గ్రామస్థులు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మ ఆలయానికి దారి హద్దుల నకలు కోరుతూ గ్రామస్థుల వినతి

రాయికల్, ఏప్రిల్ 04 (ప్రజా జ్యోతి)



రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలోని గుట్టపై ఉన్న కనకదుర్గాదేవి ఆలయానికి దారి చూపాలని గ్రామస్థులు గత సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఇందుకు సంబంధించి దరఖాస్తు సమర్పించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు సహాయ సంచాలకులు, భూమి కొలతలు మరియు రికార్డుల శాఖకు చెందిన జగిత్యాల జిల్లా అధికారులు గ్రామానికి చేరుకుని రెండు రోజుల పాటు డిజిటల్ పరికరాలతో భూముల సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ఆలయానికి సంబంధించిన భూమి సరిహద్దులను నిర్ణయించారు.ఈ నేపథ్యంలో, సర్వే ప్రకారం ఉన్న భూమి సరిహద్దుల నక్షా మరియు భూమి కొలతల మ్యాప్‌ను తమకు అందజేయాలని గ్రామస్థులు కోరుతూ ఈరోజు జగిత్యాల కలెక్టర్ సముదాయంలో ఉన్న సహాయ సంచాలకులు (భూమి కొలతలు మరియు రికార్డులు) అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు అనుమల్ల రమబుస, గంగా మల్లయ్య, తొగిటి నవీన్, భూపల్లి పరమేష్, బతిని శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే గ్రామ నాయకులు అనుమల్ల సత్యనారాయణ, మ్యాదరి మల్లయ్య, కొల్ల కృష్ణ రెడ్డి, పాలడుగు లింగారెడ్డి తదితరులు హాజరయ్యారు.

# ప్రజా సమస్యలకు పరిష్కారమే లక్ష్యం

## తెర్లుమద్ది గ్రామంలో "ప్రజా బాట" కార్యక్రమం విజయవంతం

ముస్తాబాద్, ఏప్రిల్ 4 ( ప్రజా జ్యోతి ):

రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్ మండలంలోని తెర్లుమద్ది గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "ప్రజా బాట"



కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన మరియు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామ స్థాయిలోనే విద్యుత్ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామ కార్యదర్శి సౌజన్య, వార్డు సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో రైతులు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైతులు తెలిపిన సమస్యలను అధికారులు నమోదు చేసుకొని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు దగ్గరగా వెళ్లి పరిష్కారం చూపడం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# జగ్జీవన్ రామ్ విగ్రహం ధ్వంసం...

## దుండగులను శిక్షించాలని డిమాండ్

కథలాపూర్, ఏప్రిల్ 4(ప్రజాజ్యోతి): కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామంలో సామాజిక నేత బాబు జగ్జీవన్




రామ్ విగ్రహం ధ్వంసం చేయడం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. ఇటీవల గ్రామంలోని సర్వే నంబర్ 59లో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని రాత్రికి రాత్రే గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడంతో మాదిగ సంఘం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై మాదిగ సంఘం సభ్యులు మాట్లాడుతూ, ఇది సమాజ గౌరవాన్ని దెబ్బతీసే చర్య అని పేర్కొన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని తక్షణమే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎమ్మార్వో కార్యాలయానికి దండుగా కదిలి వచ్చారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. జగ్జీవన్ రామ్ జయంతి సమీపిస్తున్న నేపథ్యంలో, విగ్రహాన్ని పునఃస్థాపించి గౌరవాన్ని కాపాడాలని లేనిపక్షంలో తామే ముందుకు వచ్చి విగ్రహాన్ని మళ్లీ ఏర్పాటు చేసి జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. గ్రామంలో ఇప్పటికే 144 సెక్షన్ అమల్లో ఉండగా, పోలీసులు బందోబస్తు పెంచి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో మాదిగ యువజన సంఘం నాయకులు అధ్యక్షుడు బాలే తరుణ్, ఉపాధ్యక్షులు బాలే నరహరి, మండల అధ్యక్షుడు బాలే శోభన్ బాబు, గ్రామ అధ్యక్షుడు బాలే నారాయణ, జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు పొడేటి అర్జున్, బాలే నీలకంఠం, బాలే మహేష్, గంగాధర్, శ్రీహరి, తూర్తి గణేష్, తుర్తి పున్నమయ్య, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు నష్ట పరిహారం లేకపోవడం దురదృష్టకరం

## రాయికల్‌లో మాజీ మంత్రి జీవన్ రెడ్డి ధ్వజం

రాయికల్,ఏప్రిల్ 04 (ప్రజా జ్యోతి) ప్రకృతి వైపరీత్యాల కారణంగా మొక్కజొన్న,మామిడి పంటలు కోత దశలోనే నష్టపోవడం చాలా దురదృష్టకరమని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాయికల్ మండల కేంద్రంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు.గత సంవత్సరం గానీ,ఈ సంవత్సరం గానీ పంట నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పంటల బీమా పథకం అమల్లో ఉంటే రైతులకు కొంతమేర ఉపశమనం లభించేదని అన్నారు. కానీ ప్రస్తుతం రైతులు బీమా కంపెనీల నుంచి కూడా ఎలాంటి పరిహారం పొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల బీమా పథకాన్ని విధానాల్లో పొందుపరచినా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దానిపై స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు.ప్రభుత్వపరంగా పరిహారం లేకపోవడం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రైతు భరోసా పథకంపై మాట్లాడుతూ, ప్రస్తుతం ఎకరానికి రూ.6000 మాత్రమే ఇవ్వడం సరిపోదని, పెద్ద ఎత్తున భూములు కలిగిన రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. గతంలో ఉన్న విధంగా ఎకరాల పరిమితి లేకుండా ప్రతి ఎకరానికి రూ.6000 చొప్పున రైతు భరోసా




ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న పంట విషయంలో రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని చెప్పారు. మద్దతు ధర రూ.2400 ఉండగా, మార్కెట్‌లో రూ.1800కే కొనుగోలు జరుగుతుందని, దళారులు లాభపడుతున్నారని విమర్శించారు. రాయికల్ మార్కెట్‌లో మొక్కజొన్న నిల్వలు పెరిగినా ఇప్పటివరకు కొనుగోలు కేంద్రం ప్రారంభం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు ప్రకటించినా,అక్కడ కూడా తూకం ప్రక్రియ ప్రారంభం కాలేదని తెలిపారు. మల్లాపూర్ ప్రాంత రైతులు కూడా రాయికల్‌కు పంట తీసుకువస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందన్నారు.పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20,000 పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని, భూమి లేని వారికి ఇందిరమ్మ కుటుంబ సమగ్ర బీమా పథకాన్ని అమలు చేయాలని సూచించారు.పంటలు పూర్తిగా చేతికి రావాలంటే ఏప్రిల్ 15 వరకు ఎస్సారెస్పీ ద్వారా నీటి సరఫరా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు సంక్షేమం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# చంద్రరథోత్సవంలో భక్తిరస ప్రవాహం

## ఇల్లందకుంటలో వైభవంగా శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

ఇల్లందకుంట, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి):



అపార భక్తిశ్రద్ధల మధ్య ఇల్లందకుంటలో నిర్వహిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు రోజురోజుకూ ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన చంద్రరథోత్సవం భక్తజనాల సందడి మధ్య ఘనంగా జరిగింది. చంద్రుని కాంతిలో అలంకరించబడిన రథంపై స్వామివారు కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకలకు హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, "శ్రీరాముడు కదలాడిన పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన ఇల్లందకుంటలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ పాలకవర్గం, అధికారులు ఎంతో శ్రద్ధతో నిర్వహిస్తున్నందుకు అభినందనలు," అని తెలిపారు. ఇక శ్రీరాముడి దివ్య ఆశీస్సులతో హుజూరాబాద్ ప్రాంతం సుభిక్షంగా, శాంతియుతంగా అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

చంద్రరథోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ సుహాసిని, ఆలయ చైర్మన్ రామారావు, ఆలయ ఈఓ సుధాకర్, డైరెక్టర్లు, ఇల్లందకుంట మరియు జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ఆలయ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు



# చెట్లు నరికి డబ్బులు స్వాహా..

## గ్రామసభలో సర్పంచ్ ఒప్పుకోలు

కొడిమ్యాల, ఏప్రిల్ 04,(ప్రజాజ్యోతి):

మండలం తిప్పాయిపల్లి గ్రామ సర్పంచ్ ల్యాగల రాజేశం అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఘటన వెలుగులోకి



వచ్చింది. గ్రామంలోని నల్లగొండ రోడ్డునుంచి గంగిశెట్టి ఆంజనేయులు షెడ్డు దారి వరకు ఉన్న చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా నరికి విక్రయించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ చెట్ల విక్రయం ద్వారా వచ్చిన సుమారు రూ.20 వేల రూపాయలను గ్రామ నిధిగా జమ చేయకుండా స్వంత అవసరాలకు వినియోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గురువారం జరిగిన గ్రామ సభలో ఈ విషయంపై గ్రామ ప్రజలు ప్రశ్నించగా, చెట్లను అమ్మిన విషయం, డబ్బులు జమ చేయని విషయాన్ని సర్పంచ్ స్వయంగా ఒప్పుకున్నట్లు సమాచారం. చెట్ల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్న సమయంలో ప్రజాప్రతినిధి ఇలాంటి చర్యలకు పాల్పడటం విమర్శలకు దారి తీసింది. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, ప్రకృతి ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

# చందుర్తి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్

వేములవాడ,ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి:

శనివారం రోజున చందుర్తి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి, చట్టపరంగా నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి



భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందిస్తూ సంఘటనా స్థలానికి త్వరితగతి న చేరుకోవాలని బ్లూ కోల్ట్, పెట్రో లింగ్ వాహన సిబ్బందిని ఆదేశిం చారు. పెట్రోలింగ్ సమయంలో రౌ డీ షీటర్లపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు. ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయాలని, గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో మమేకమై నేర నియంత్రణలో భాగస్వామ్యం కావాలని సూచిం చారు. ప్రజాఫిర్యాదులపైఇలస్యం చేయకుండా బాధితులకు తక్షణ స్పందన ఇవ్వాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లోమద్యంసేవించడం,డ్రంక్ అండ్ డ్రైవ్ లపై ప్రత్యేక దృష్టిసా రించి రోడ్డు ప్రమాదాల నివారణ కు కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాల కు పూర్తిగా చెక్ పెట్టేలాముందస్తు చర్యలు తీసుకోవాలనితెలిపారు. ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాస్, సి.ఐ వెంకటేశ్వర్లు, ఎస్.ఐ రమేష్ సిబ్బంది ఉన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

## జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్ రెడ్డి

ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 4( ప్రజా జ్యోతి):



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం రోజు 11 గంటలకు జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వము వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని రైతులు దళారులకు అమ్ముకునే పరిస్థితి వచ్చిందని కొనుగోలు కేంద్రాలు స్థాపించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వరి కోతలు ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం ఎక్కడా వరి ధాన్యం కొనుగోలు కేంద్రం తెరవలేదని ఈ సందర్భంగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు

## వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం





**ఇల్లందు, ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి:** మున్సిపల్ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ఆధ్వర్యంలో శరత్ మాక్స్ విజన్ కంటి హాస్పిటల్ సహకారంతో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ దండు సారయ్య మాట్లాడుతూ 13వ వార్డు ప్రజలకు శరత్ మాక్స్ విజన్ కంటి హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. వివిధ రకాల కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిదంగా అవసరమైన వారికి కళ్లద్దాలతో పాటు ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి 13వ వార్డు ప్రజల నుండి అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శరత్ మాక్స్ విజన్ కంటి హాస్పిటల్ సిబ్బంది, 13వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

### కార్మికుల హక్కుల
## పరిరక్షణ ఐఎన్టియుసితోనే సాధ్యం





**టేకులపల్లి, ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి** :సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ ఐఎన్టియుసి తోనే సాధ్యమని ఐఎన్టియుసి సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజు, ఐఎన్టియుసి ఇల్లందు ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు లు స్పష్టం చేశారు.శనివారం ఇల్లందు ఏరియా కెఓసిలో జరిగిన ఐఎన్టియుసి పిట్ సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎంతో జరిగే సమావేశాల్లో సింగరేణి కార్మికుల సమస్యలపై కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు, మంత్రులు మాట్లాడే విధంగా చూస్తామన్నారు.సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం వర్క్‌పై ఆదాయ పన్ను మాఫీ,కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు,మెడికల్ బోర్డు పునరుద్ధరణ వంటి కీలక అంశాలపై ఐఎన్టియుసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుంద ని తెలిపారు. ఐఎన్టియుసి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి. సంజీవ రెడ్డి,సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతుందని స్పష్టం చేశారు.గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి 2 ఏళ్ళు పూర్తయినా కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టకుండా ఏఐటీయుసి కాంగ్రెస్ పార్టీ గెలిపించిన ఒక ఎమ్మెల్యే ను పట్టుకొని రాజకీయ ప్రయోజనాలకే పరిమితమైందని విమర్శించారు. గుర్తింపు సంఘంగా పూర్తిగా విఫలమైన ఏఐటియుసి ప్రస్తుతం ధర్నాలు,దొంగ దీక్షల పేరుతో కార్మికులను మోసం చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు.కాంగ్రెస్ సహకారంతో సహాయంతో గెలిచిన ఒక్క ఎమ్మెల్యేతో సింగరేణిలో రాజకీయ జోక్యం చేస్తూ కార్మిక సమస్యలను పరిష్కరించడానికి చేతకాక చేతులు దులుపుకొని, కాంగ్రెస్ పార్టీ రాజకీయ జోక్యం చేస్తుందని అనటం ఏమిటని ప్రశ్నించారు.మున్సిపల్ ఎన్నికల్లో అక్రమ పొత్తులు పెట్టుకోవడం, స్ట్రక్చర్ మీటింగ్‌ను బహిష్కరిం చడం వంటి చర్యలు కార్మిక సంఘం బాధ్యతలకు విరుద్ధమని పేర్కొన్నారు.ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్టియుసి చొరవతోనే మళ్లీ సమావేశం ఏర్పాటు చేయించామని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ మద్దతు తీసుకుంటునే అదే పార్టీని విమర్శించడం సరికాదని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు,పొంగులేటి శ్రీనివాస రె డ్డి,ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యలతో చర్చించి సింగరేణి కార్మికుల సంక్షేమానికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఐఎన్టియుసి జనరల్ సెక్రటరీ గోచికొండ సత్యనారాయణ, ఐఎన్టియుసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రారంబానికి సిద్ధంగా
## ఉన్న బాబు జగజ్జీవన్ రావు విగ్రహం
- విచ్చేయనున్న మాజీ శాసన సభ్యులు సండ్ర



**వేంసూర్ ఏప్రిల్ 4 ప్రజాజ్యోతి** వేంసూరు మండలంలో భరణిపాడు గ్రామంలో బాబు జగజ్జీవన్ రావు విగ్రహం ప్రారంబానికి సిద్ధంగా ఉంది మాజీ సర్పంచ్ బోయ ఏసు కృషితో విగ్రహానికి అడుగులు పడ్డాయి దీనిని త్వరగా ఆవిష్కరణ చేయాలని ఉద్దేశం తో పనులు పూర్తి చేసి ఆయన జయంతి రోజున అనగా ఏప్రిల్ 5 తారీకు ఆదివారం సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య చేతులు మీదగా ఆవిష్కరణకు ఏర్పాట్లు చేశారు బాబు జగజ్జీవన్ రావు 30 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా పనిచేసి మాజీ ఉప ప్రధానిగా సేవలు అందించారు అంతే కాకుండా దళితుల కోసం ఆయన చాలా చేశారు కాబట్టి ఆయన స్మరించుకోవటమే ఆయనకు ఇస్తున్న నిజమైన నివాళులు అని విగ్రహ దాత మాజీ సర్పంచ్ బోయ ఏసు అన్నారు దీనికి సహకరించి నిర్మాణం కోసం విరాళాలు ఇచ్చిన మందపాటి మహేశ్వరరెడ్డి, మందపాటి వెంకటరెడ్డి గుడి వెంకటరెడ్డి మరియు స్థలం దాత సింగపోగు రమేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.

### భట్టి విక్రమార్క కుమారుడి
## రిసెప్షన్‌కు ఆహ్వానించిన సర్పంచ్ టోని



**కారేపల్లి, ఏప్రిల్ 4, ప్రజా జ్యోతి:** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క -- నందిని దంపతుల జ్యేష్ఠ కుమారుడు సూర్య విక్రమాదిత్య, సాక్షిల వివాహం ఇటీవల హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహానికి పలువురు ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వివాహానంతరం ఈ నెల 5వ తేదీ (ఆదివారం) ఖమ్మంలో జరగనున్న రిసెప్షన్ వేడుకకు సంబంధించి, సింగరేణి మండలంలోని అధికారులు, మీడియా మిత్రులు,ముఖ్య అతిథులు, పార్టీ పెద్దలు, కార్యకర్తలకు సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) శనివారం స్వయంగా ఆహ్వాన పత్రికలను స్వయంగా అందించి ఈ రిసెప్షన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై నూతన దంపతులను ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త సురేందర్ మానియార్, ఎస్.కె షఫీ, తాజుద్దీన్, ఆదెర్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమానికి 'సౌర' వెలుగులు
- తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్ట్ భారీ వితరణ - రూ. 5 లక్షల వ్యయంతో 10 కేవీ సోలార్ ప్లాంట్ ఏర్పాటు
- తొలి జీతాన్ని సామాజిక సేవకు వెచ్చించిన ప్రవాస భారతీయుడు సాయిపంచాక్షర్





**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 4 ప్రజాజ్యోతి** నిరుపేదలు, వృద్ధుల పట్ల తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు మరోసారి తన ఉదారతను చాటుకుంది. భద్రాచలంలోని సరోజిని వృద్ధాశ్రమానికి రూ. 5 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 10 కేవీ సోలార్ విద్యుత్ వ్యవస్థను శనివారం లాంఛనంగా ప్రారంభించారు.

**తొలి జీతంతో సేవా కార్యక్రమం**
ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య మనవడు, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ - నీలిమ దంపతుల కుమారుడు సాయిపంచాక్షర్ తన సేవా గుణాన్ని చాటుకున్నారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న ఆయన, తన మొదటి నెల వేతనం రూ. 5 లక్షలను వెచ్చించి ఈ సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని కల్పించడం విశేషం. చిన్నతనం నుంచే సామాజిక స్పృహ కలిగిన సాయిపంచాక్షర్, తన సొంత గడ్డపై సేవా కార్యక్రమాలకు చేయూతనివ్వడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

**ఆశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర:**
బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన తాళ్లూరి కుటుంబం గతంలోనే ఈ ఆశ్రమ భవన నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులను చేపట్టింది. ప్రస్తుతం సోలార్ విద్యుత్ ఏర్పాటు ద్వారా ఆశ్రమానికి కరెంటు కష్టాలు తీరడమే కాకుండా, విద్యుత్ బిల్లుల భారం కూడా తగ్గనుంది. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు సరోజిని మాట్లాడుతూ.. ట్రస్ట్ సభ్యులు చూపుతున్న నిరంతర ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పట్టణ ప్రముఖులు అడుసుమిల్లి జగదీశ్, పల్లంటి దేశప్ప, మోతుకూరి వీరయ్య, బొడ్డపాటి రామారావు, చావా లక్ష్మీనారాయణ, జలగం చంద్రశేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ట్రస్ట్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, తానా మాజీ అధ్యక్షులు తాళ్లూరి జయశేఖర్ - నీలిమ దంపతులతో పాటు ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, బూర్గంపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ పాల్గొన్నారు.

# పెద్ద బజార్లో ట్రాఫిక్ రద్దీ
- ట్రాఫిక్ నియంత్రణకు మార్గమే లేదా..?
- భారీ వాహనాల రాకతో ప్రజలకు ముప్పు
- నిత్యం ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- అధికారుల స్పందనతోనే సమస్యకు పరిష్కారం







**కొత్తగూడెం, ఏప్రిల్ 4 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పెద్ద బజార్ మార్కెట్ ప్రాంతం రోజురోజుకు ట్రాఫిక్ రద్దీతో కిక్కిరిసిపోతోంది. వ్యాపారులకు సరుకులు తరలించే భారీ లారీలు నిరంతరం సంచరిస్తుండటంతో రహదారులపై తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికే ఇరుకైన రహదారులపై భారీ వాహనాలు సులభంగా తిరగలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో వాహనాలు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలకు తగిలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశముందని ట్రాఫిక్ నియంత్రణకు సరైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పెద్ద బజార్ ప్రాంతంలోకి భారీ లారీలు ప్రవేశించడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌కు వచ్చే సరుకులను పట్టణ ప్రారంభంలోనే అన్‌లోడింగ్ పాయింట్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి చిన్న వాహనాల ద్వారా తరలిస్తే ట్రాఫిక్ సమస్య కొంతవరకు తగ్గే అవకాశం ఉందని స్థానికులు సూచిస్తున్నారు.

**ట్రాఫిక్ నియంత్రణలో లోపాలపై విమర్శలు**
పట్టణంలోని ఎం.జి రోడ్ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ పరికరాలు ఏర్పాటు చేసినప్పటికీ పెద్ద బజార్‌లో మాత్రం తగిన చర్యలు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. సంబంధిత అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు వ్యాపారుల నుంచి లాభాలు పొందుతున్నందునే అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**భారీ వాహనాల రాకతో ప్రమాద సూచనలు**
నిత్యం రద్దీగా ఉండే పెద్ద బజార్ గల్లీల్లో భారీ లారీలు సంచరించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే కూరగాయల బండ్లు, చిన్న వ్యాపారాలు రోడ్డుపై ఉండటంతో మార్గం మరింత ఇరుకుగా మారింది. ఈ పరిస్థితుల్లో అత్యవసర సమయంలో అంబులెన్స్ వంటి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

**తక్షణ చర్యలపై ప్రజల డిమాండ్**
పెద్ద బజార్‌లో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలంటే సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రమాదాలు జరగకముందే ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కొత్తగూడెం ప్రగతి మైదానంలో క్రికెట్ సందడి
- ఎంపీ వద్దిరాజు చేతుల మీదుగా గాయత్రి క్రికెట్ ఛాంపియన్స్ ట్రోఫీ--2026 ప్రారంభం




**కొత్తగూడెం, ఏప్రిల్ 4 ( ప్రజాజ్యోతి )** ఆటలలో పాల్గొనడం ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రగతి మైదానంలో శనివారం గాయత్రి క్రికెట్ ఛాంపియన్స్ ట్రోఫీ--2026ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు బాణసంచా పేల్చి డప్పు వాయిద్యాలతో ఎంపీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ రవిచంద్రతో పాటు బీఆర్ఎస్ నాయకులు అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. టాస్ వేసి స్వయంగా బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించిన ఎంపీ, క్రికెట్ జట్టు సభ్యులతో పరిచయం అయ్యారు. నిర్వాహకులు బీ.శ్రీనివాస్, కన్నిలు పాల్గొన్న క్రీడాకారులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత క్రికెట్ జట్టు అద్భుత ప్రతిభ కనబర్చుతోందని ప్రశంసించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని క్రీడా రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్, వనమా రాఘవ, కాపు సీతామహాలక్ష్మి, ఆకుల గాంధీ, ఏనుగుల రాకేష్ రెడ్డి, రంగనాథ్, బాదావత్ శాంతి నాయక్ తదితరులతో పాటు కార్పొరేటర్లు మల్హోత్రా సాగర్, కాలేరు సింధూ తపస్వి, బొమ్మిడి రమాకాంత్, బాదావత్ శ్రీకాంత్, నవతన్, అనుదీప్ తదితరులతో పాటు యువత ఈ పోటీలకు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.



### వాహనదారులకు మంచి
## సేవలు అందించాలి: ఎమ్మెల్యే రాగమయి

**సత్తుపల్లి ఏప్రియల్04(ప్రజా జ్యోతి)** వాహనదారులకు మెరుగైన సేవలు అందించి,మంచి పేరు తెచ్చుకోవాలని సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శనివారం ఆమె ఎం.వి.ఐ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయంలో వాహనదారులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో, గతంలో ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గమనించిన ఆమె కార్యాలయంలో టాయిలెట్స్ ఏర్పాటు చేపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులకు అన్ని సౌకర్యాలు ఉండాలని ఉద్దేశంతో,టాయిలెట్స్ నిర్మించామని, కార్యాలయానికి వచ్చే వాహనదారులకు మంచి సేవలు అందించి,మంచి పేరు తెచ్చుకోవాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్,వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, కొత్తూరు ఉపసర్పంచ్ గొర్లమారి రామ్మోహన్ రెడ్డి, వార్డు సభ్యులు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, మందపాటి ప్రభాకర్ రెడ్డి, జగన్నాథం శ్రీను, దూదిపాల రాంబాబు, కార్యాలయ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



## ఘనంగా రన్ ఫర్ జీసస్

**ఇల్లందు రూరల్, ఏప్రిల్ 4, ప్రజాజ్యోతి:** గుడ్ ఫ్రై డే ను పురస్కరించుకొని శనివారం అన్ని చర్చిల సంఘాల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ను ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో ఏసు క్రీస్తు శాంతి సందేహాలు, ఆయన గొప్పతనాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ సాధనపల్లి క్రాంతి, ఫాస్టర్లు పాల్ దినకర్, జాన్సన్, సెల్వరాజు, చార్లెస్, పాశం రాకేష్ కిరణ్, పాశం రోహిత్ తదితరులు పాల్గొన్నారు.





## సింగరేణి కార్మికులకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి..

బ్యాంక్ అధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. కార్మికులందరికీ జీతాల ఖాతాలు అదే బ్యాంకులో ఉండటంతో, సామాజిక బాధ్యతలో భాగంగా ఈ అదనపు ప్రయోజనాన్ని కల్పించేందుకు బ్యాంక్ అంగీకరించింది.సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఇది వర్తిస్తుంది. ఈ నూతన బీమా విధానం ఈ నెల 1వ తేదీ నుండే అమలులోకి వచ్చింది. దీని కోసం కార్మికులు



ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది పూర్తిగా ఉచితంగా అందించే సేవ. సింగరేణి వంటి కష్టతరమైన వృత్తిలో ఉన్న కార్మికులకు ఈ పథకం పెద్ద అండగా నిలవనుంది. విధి నిర్వహణలో కాకుండా, ఇంటి వద్ద సహజంగా మరణించినా వారి కుటుంబాలకు ఈ 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందుతుంది. ఇది కార్మిక కుటుంబాల్లో భరోసాను నింపుతోంది. సింగరేణి చరిత్రలో ఇలా సహజ మరణానికి కూడా భారీ మొత్తంలో బీమా వర్తించడం ఇదే తొలిసారి అని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. యాజమాన్యం , యూనియన్ బ్యాంక్ తీసుకున్న ఈ నిర్ణయంపై కార్మికుల నుండి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

## కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

మొదటిపేజీ తరువాయి..

ప్రజాస్వామ్యం పై సీఎం చేయించిన దాడి అని ఆరోపించారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోందని మండిపడ్డారు.ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా?. కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటని అన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా? ఎందుకు అడ్డుకోవడం లేదంటూ ప్రశ్నించారు. ఒకవైపు ' హేట్ స్పీచ్ బిల్ ' పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ, మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజా పాలన? అంటూ నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యమని చెబుతూ గూండా రాజ్యం అమలు చేస్తారా? అని అన్నారు . సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేసారని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే, ఇక్కడ పాలనను ఎవరు చూస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల



కార్యాలయాలపై దాడులు చేయాలని సందేశాలు ఇచ్చారా? కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి ఇప్పుడు, ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారు. మీ అణచివేతలకు, నిర్బంధాలకు, దాడులకు బీఆర్ఎస్ పార్టీ అదరదు, బెదరదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌ను అడుగడుగునా నిలదీస్తూనే ఉంటాం, ప్రజల తరఫున పోరాటం చేస్తూనే ఉంటామని వివరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడులు జరిపిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీకి డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ప్రతిపక్ష నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనమని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు కేసీఆర్ కార్యాలయంపై దాడి చేయడం అంటే తెలంగాణ ప్రజల గౌరవంపై దాడి చేసినట్టేనని మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రజలు ఎప్పటికీ సహించరని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేత కార్యాలయంపై దాడి జరగడం అత్యంత ఆందోళనకరమని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అధికార అహంకారంతో కాంగ్రెస్ నాయకులు హద్దులు దాటుతున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను భయపెట్టేందుకు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులకే రక్షణ లేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించి దాడికి పాల్పడిన వారిని గుర్తించి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారికి ప్రభుత్వం అండగా నిలిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీపై ఎలాంటి అణచివేతలు చేసినా వెనక్కి తగ్గబోమని, ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలపై దాడులు ఆపాలని, తెలంగాణ గౌరవాన్ని కాపాడాలని సూచించారు.

# గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ విద్య చేరువ కావాలి

**నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి**

**ఘనంగా హైదరాబాద్ ప్రైడ్ పబ్లిక్ గర్ల్స్ స్కూల్, కాలేజ్ ప్రథమ వార్షికోత్సవం**

**మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ**

కోదాడ టౌన్, ఏప్రిల్ 04 (ప్రజా జ్యోతి): నగరాలకు దీటుగా విద్యా ప్రమాణాలతో కోదాడలో హైదరాబాద్ ప్రైడ్ పబ్లిక్ గర్ల్స్ స్కూల్, కాలేజ్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ అన్నారు. శనివారం పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన పాఠశాల ప్రథమ వార్షికోత్సవానికి వారు ముఖ్యఅతిథిలు గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ వి విద్యా సంస్థల









చైర్మన్ ముత్తినేని సైదేశ్వరరావు గత మూడు దశాబ్దాలకు పైగా నైతిక విలువలు,క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చారని అన్నారు. వారి బాటలోనే ముత్తినేని పృథ్వీ రమణరావు సామాజిక దృక్పథంతో ఈ విద్యాసంస్థను స్థాపించి, గ్రామీణ విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్యను అందుబాటులోకి తెచ్చారని కొనియాడారు. విశ్రాంత అధ్యాపకులు శ్రీరామ కవచం వెంకటేశ్వర్లు, భరత రావు లు మాట్లాడుతూ కేవలం చదువే కాకుండా నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థుల్లో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని దాని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, హైదరాబాద్ ప్రైడ్ పబ్లిక్ గర్ల్స్ స్కూల్, కాలేజ్ చైర్మన్ ముత్తినేని పృథ్వీ రమణరావు,మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లీశ్వరి, కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ వెంకట్ నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రలోని యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. 'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది



ఎవరైనా ఊహించవచ్చని అన్నారు. ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ది పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. శబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్‌డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్ట్రాల్లో మాదిరిగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ ఆయన.. పశ్చిమాసియా అంశంపై భయాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టు కొత్త అవకాశాలను తీసుకురాగలదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది శబరిమలకు ప్రత్యక్ష అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని.. స్థానిక వ్యాపారాలకు కొత్త ఊపునిస్తుందని చెప్పారు. యువతకు కొత్త ఉపాధి మార్గాలను తెరుస్తుందని వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. భాజపా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇలాంటి అడ్డంకులన్నీ తొలగిపోతాయన్నారు.కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న ఒకే విడతలో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు

మొదటిపేజీ తరువాయి..

ఈమెయిల్స్‌కు హానికరమైన ఫిషింగ్ లింకులు పంపడం ద్వారా కంప్యూటర్లలోకి మాల్వేర్‌ను ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల సిస్టమ్స్‌పై నేరగాళ్లు పూర్తిస్థాయి రిమోట్ యాక్సెస్‌ను పొందుతూ అక్రమాలకు తెరలేపుతున్నారని చెప్పారు. ఈ మేరకు వివరాలు వెల్లడిస్తూ ఓ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. సిస్టమ్ నియంత్రణలోకి వచ్చిన తర్వాత అందులో యాక్టివ్‌గా ఉన్న వాట్సాప్ వెబ్ సెషన్లను నేరగాళ్లు చాకచక్యంగా వినియోగిస్తున్నారని సీపీ తెలిపారు. సీఈఓ లేదా సీఎఫ్ఓల పేరుతో అకౌంటెంట్లకు తప్పుదారి పట్టించే సందేశాలను పంపిస్తూ నమ్మిస్తున్నారని వెల్లడించారు. తాము అత్యవసర సమావేశంలో ఉన్నామని, ఫోన్ ఎత్తడం వీలుపడదని చెబుతూ కోట్లాది రూపాయలు కాజేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలతో తక్షణమే తమ ఖాతాలకు డబ్బును బదిలీ చేయించుకుంటున్నారని చెప్పారు. పై అధికారుల నంబర్ల నుంచే సందేశాలు వస్తుండటంతో అకౌంటెంట్లు కూడా నిజమేనని నమ్మి మోసపోతున్నారని అన్నారు. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ప్రతి కంపెనీ కూడా ఇటువంటి సైబర్ దాడుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్‌లో పై అధికారుల పేరుతో వచ్చే ఆర్థిక అభ్యర్థనలను గుడ్డిగా నమ్మకూడదని పేర్కొన్నారు. వెంటనే అధికారులకు నేరుగా ఫోన్ చేసి ఆ సందేశం నిజమేనా కాదా అని ధృవీకరించుకోవాలని చెప్పారు. ఆఫీసు సిస్టమ్స్‌లో నాణ్యమైన ÷ర్వాల్స్, యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లను నిరంతరం అప్‌డేట్ చేసి ఉంచాలని అన్నారు. వాట్సాప్ వెబ్ వాడిన ప్రతిసారి తప్పకుండా లాగౌట్ చేయడం మర్చిపోవద్దని తెలిపారు. సాంకేతిక భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారానే ఇటువంటి దాడులను ఎదుర్కోగలమని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సజ్జనర్ చెప్పారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త వహించాలని వివరించారు.

## మహిరాష్ట్రలో ఘోర ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా వారిని మృత్యువు కబళించింది. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేరకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. ఆ కారులో 8 మృతదేహాలు ఉన్నాయి. కారు నుంచి బయటపడిన మరో బాలిక మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెతికి వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సునీల్ దత్తాత్రేయ దర్గుడే కారు నడుపుతున్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కాగా ఈ ప్రమాదంలో మరణించిన ఆరుగురు పిల్లలు 7 నుంచి 14 ఏళ్ల మధ్య వయసు వారేని తెలిపారు. ఆ ఆరుగురిలో ఒకరు బాలుడు, ఐదుగురు బాలికలు ఉన్నట్లు చెప్పారు.

## భారీ పేలుళ్లకు ఉగ్రకుట్ర

మొదటిపేజీ తరువాయి..

ప్లాన్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నలుగురు నిందితులు టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పాకిస్థాన్ తీవ్రవాద గ్రూపులతో సంబంధాలు కలిగి ఉన్నట్లు విచారణలో ఏటీఎస్ పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు మీరట్‌కు చెందిన సాకిబ్ అలియాస్ డెవిల్ అని తెలిపారు. మిగిలిన ముగ్గురితో కలిసి దేశంలో అతను పేలుళ్లకు ఎ÷-లాన్ చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్ 2న లక్నో రైల్వేస్టేషన్ వద్ద పేలుడుకు కుట్ర పన్నుతుండగా పక్కా సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిపై వివిధ చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి పేలుడు పదార్థాలు, ఏడు స్మార్ట్ ఫోన్లు, 24 కరపత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ నిందితులు కొన్ని



ప్రదేశాల్లో చిన్నపాటి పేలుళ్లకు పాల్పడ్డారని.. దాన్ని వీడియో తీసి ఉగ్రసంస్థలకు పంపారని పోలీసులు తెలిపారు. దాని ద్వారా ఉగ్రసంస్థల నుంచి నిధులు సేకరించారని పేర్కొన్నారు. వీరంతా సోషల్ మీడియాను ఉపయోగించి యువతను తీవ్రవాదం వైపు ఆకర్షించే ప్రయత్నం చేశారన్నారు. రైల్వే సిగ్నల్స్, గ్యాస్ సిలిండర్ల ట్రక్కులు, ప్రభుత్వ కీలక ఆస్తులే లక్ష్యంగా దాడికి ఎ÷-లాన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే వీరంతా రాజకీయ ప్రముఖుల ఇళ్లు, ప్రముఖ సంస్థల వద్ద రెక్కీ నిర్వహించారని.. ఆ సమాచారాన్ని పాకిస్థానీ హ్యాండ్లర్లకు పంపారని తెలిపారు. ఘజియాబాద్, అలీగఢ్, లక్నోతోపాటు ప్రముఖ ప్రదేశాల్లో వీరంతా సర్వే చేశారని పోలీసులు పేర్కొన్నారు.





Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967